జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, ఫిబ్రవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

# త్వరితగతిన డేటా అనుసంధానం

- శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు వాడండి
- వాట్సాప్ గవర్నెన్స్‌లో మరిన్ని సేవలు అందించండి
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**అమరావతి, మహానాడు:** ప్రభుత్వ శాఖల మధ్య డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..అన్ని శాఖల మధ్య ఉన్న డేటాను ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేసే పనుల్లో మరింత వేగం పెరగాలని సూచించారు.

డేటా మొత్తం ఒక చోటుకు చేర్చి డేటాలేక్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, మెరుగ్గా అందించేందుకు వీలుంటుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డీప్ టెక్నాలజీ లాంటి సాంకేతికతలను ఉపయోగించుకుని డేటాను విశ్లేషించుకుని ఆయా శాఖల పనితీరు మెరుగుపరచడానికి దోహదపడేలా ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారం అందించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సులభంగా సేవలు అందించగలమని, ప్రస్తుతం అందిస్తున్న సేవలతో పాటు అదనంగా ఏం అందించగలమో పరిశీలించాలని ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగించేవారికి సాంకేతిక అవరోధాలు లేకుండా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

**శాంతిభద్రతల పరిరక్షణకు విస్తృతంగా సీసీ కెమెరాలు**

రాష్ట్రంలో ఇప్పటివరకు 14,770 సీసీ కెమెరాలను వినియోగంలో ఉన్నాయని, శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరస్థులను పట్టుకోవడంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తదితర సాంకేతికను ఉపయోగించుకోవాలన్నారు.

మిగతా.. 2లో

# రేవంత్.. కేసీఆర్‌కు సెంటి‘మంట’





**రాజకీయాల్లో ఎంత కొమ్ములు తిరిగిన మొనగాడయినా సెంటి‘మంట’కు వణికిపోవాల్సిందే. ఫలాన సీఎం ఫలానా చోటకు వెళ్లిన వెంటనే మాజీగా మారిపోతారన్న సెంటిమెంటు నిజమైన తర్వాత, ఇక ఏ సీఎం కూడా ఆ ప్రాంతానికి వెళ్లరు. ఫలానా మంత్రి ఫలానా గుడికి వెళితే మాజీగా మారతారన్న సెంటిమెంట్ ఏర్పడితే, ఇక ఏ మంత్రీ అక్కడికి వెళ్లేందుకు సాహసించరు. ఇది కొన్ని దశాబ్దాలుగా రాజకీయాలను ఫాలో అవుతున్న వారందరికీ తెలిసిందే.**

- తెలంగాణలో ‘ఐరెన్‌లెగ్’పై ‘సోషల్’ వార్
- సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లిన రాష్ట్రాల్లో ఓటమి అంటూ బీఆర్ఎస్ మైండ్‌గేమ్
- రేవంత్‌ది ఐరన్‌లెగ్ అంటూ మానసిక ప్రచారానికి తెరలేపిన బీఆర్ఎస్
- రేవంత్‌ది ఐరన్‌లెగ్.. భట్టిది గోల్డెన్‌లెగ్ అంటూ కాంగ్రెస్‌లో కొత్త ప్రచారం
- పోతూ పోతూ నలుగురిని తీసుకువెళ్లడమంటే ఇదేనేమో నంటూ కేసీఆర్‌పై రేవంత్ సోషల్‌మీడియా దళం ఎదురుదాడి
- గతంలో కేసీఆర్ కలసిన వారంతా ఓడిపోయారంటూ రివర్స్‌గేర్
- కాంగ్రెస్-బీఆర్ఎస్ సోషల్‌మీడియా వార్‌ను ఆస్వాదిస్తున్న బీజేపీ
- అంతిమంగా తనకే లాభిస్తుందన్న అంచనాతో బీజేపీ

మహానాడు ఫోకస్

**(మార్తి సుబ్రహ్మణ్యం)**

ఇప్పుడు ఆ సెంటి‘మంట’ తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారానికి వెళ్లిన అన్ని రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోవడంతో.. ఆయనది ఐరన్‌లెగ్ అన్న మానసిక ప్రచారం విస్తృతమయింది. అంటే హర్యానా, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేసినా.. కాంగ్రెస్ పిండం గట్టెక్కలేదు.

సరికదా.. ఢిల్లీ ఎన్నికల్లో డిపాజిట్లు దక్కిచుకున్న సంఖ్య డజను కూడా దాటని విషాదం. అప్పటికీ పాపం.. కాంగ్రెస్ హామీలను నెరవేర్చే బాధ్యత తాను తీసుకుంటానని, రేవంత్ చెవినిల్లు కట్టుకుని చెప్పినా, ఢి ల్లీ ఓటరు కనీసం కనికరించలేదు. మహారాష్ట్ర ప్రచారానికి వెళ్లి.. కాంగ్రెస్ హామీలు అమలుచేసే బాధ్యత నేను తీసుకుంటానని ఎంత గంభీరంగా చె ప్పినా, మరాఠా ఓటరు ఆయనను లైట్ తీసుకున్నారు. పక్క రాష్ట్రం వాడన్న దయలేకుండా, కాంగ్రె స్‌ను దారుణంగా ఓడించారు.

దీనిని సద్వినియోగం చేసుకున్న బీఆర్ఎస్.. రేవంత్‌రెడ్డిది ఐరన్‌లెగ్ అని.. ఆయన ఇనుపపాద’ మహత్యంతో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతుందంటూ, సోషల్‌మీడియా వేదికగా వ్యంగ్యాస్త్రాలకు తెరలేపింది. ఆ మేరకు రేవంత్ వెళ్లిన రాష్ట్రాలు.. అక్కడ కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు, బీజేపీ గెలిచిన స్థానాలను గ్రాఫిక్ రూపంలో సోషల్‌మీడియాలో చర్చకు పెట్టింది.

‘రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో మొదలు పెట్టిన కాంగ్రెస్ పతనాన్ని ఢిల్లీతో ముగిం చార’ంటూ.. కేటీఆర్ చేసిన వ్యాఖ్యను ప్రముఖంగా ప్రచారంలో పెట్టింది.

కాగా అటు కాంగ్రెస్‌లో సైతం.. రేవంత్‌ది ఐరన్‌లెగ్ అయితే, భట్టిది గోల్డెన్‌లెగ్ అంటూ మరో వర్గం సరికొత్త ప్రచారానికి తెరలేపింది. రేవంత్‌రెడ్డి స్టార్ క్యాంపెయినర్‌గా ప్రచారం చేసిన అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోతే.. భట్టి ఇన్చార్జిగా ఉన్న జార?ండ్‌లో మాత్రం కాంగ్రెస్ గెలిచింది. కాబట్టి కాంగ్రెస్‌లో ఐరన్‌లె గ్గే కాదు. గోల్డెన్‌లెగ్గూ ఉందన్న ప్రచారానికి కాంగ్రెస్‌లోని ఓ వర్గం కొత్త ప్రచారానికి తెరలేపింది. అంటే భట్టి పట్టుకున్నదల్లా బంగారమనే రేంజ్‌లో ప్రచారం మొదలయిందంద న్నమాట. ఇది ఎవరికి లాభం? ఎవరికి నష్టమన్నది ప్రత్యే ంచి చెప్పాల్సిన





తనతో పాటు నలుగురిని తీస్కొని వెళ్ళడం అంటే ఇదేనేమో..

మిగతా.. 2లో

# శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాలకు రండి



- సీఎం చంద్రబాబును ఆహ్వానించిన అధికారులు, అర్చకులు



**అమరావతి, మహానాడు:** శ్రీకాళహస్తీశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. సచివాలయంలో సీఎంను కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.బాపిరెడ్డి, ప్రధాన అర్చకులు అందించారు. ఈనెల 21వ తేదీ నుంచి మార్చి ఆరోతేదీ వరకు శ్రీకాళహస్తిలో జరిగే బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా రావాలని సీఎంను కోరారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు సీఎం చంద్రబాబుకు స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు. ఉత్సవ ఏర్పాట్లను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, అధికారులను సీఎం అడిగి తెలుసుకున్నారు.



# రేవంత్.. దమ్ముంటే రాజీనామా చెయ్

- నువ్వు గెలిస్తే నేను రాజకీయ సన్యాసం చేస్తా
- రేవంత్ రెడ్డికి దమ్ముంటే కొడంగల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- పట్నం నరేందర్ రెడ్డి ప్రచారం కూడా చేయడు ఇంట్లోనే ఉంటాడు
- అయినా సరే ఆయనకు 50 వేల మెజారిటీకి ఒక్క ఓటు తక్కువ వచ్చి నా నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా
- రేవంత్ రెడ్డిపై పట్నం నరేందర్ రెడ్డి పోటీ చేస్తారు
- ఎవరు గెలుస్తారో కొడంగల్ ప్రజలే నిర్ణయిస్తారు
- రేషం లేని బతుకు రేవంత్ రెడ్డిది
- అల్లునికి కట్నం కింద లగచర్ల భూములు
- ఇది నామినేషన్, విజయోత్సవ సభలా ఉంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు




**కొడంగల్:** అనుముల అన్నదమ్ముల కోసం, అదానీ కోసం, అల్లుడి కోసమే కొడంగల్ నియోజకవర్గంలో సంవత్సరం నుంచి కురుక్షేత్ర యుద్ధాన్ని తలపించేలా రేవంత్ రెడ్డి అరాచకాలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు ఆరోపించారు. తన మనుషులకు వేల కోట్ల రూపాయల విలువైన భూములను దోచిపెట్టడానికే లగచర్ల రైతులపై అక్రమకేసులు బనాయించారని విమర్శిం చారు. కొడంగల్‌లో జరిగిన రైతు మహాధర్నాలో పాల్గొన్న కేటీఆర్, అల్లుడికి కట్నం కింద ఇవ్వడానికే లగచర్ల భూములకు రేవంత్ సూటీ పెట్టిండన్నారు. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్టుగా హామీలను అమలుచేస్తున్నానని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి, దమ్ముంటే ఎమ్మెల్యే

మిగతా.. 2లో




24న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం 03



నమస్తే అయ్యగారూ.. రంగరాజన్‌కు రేవంత్ రెడ్డి ఫోన్ 03



ఎర్ర కాల్వ సమస్య పరిష్కరించాలి 04



పశ్చిమ బైపాస్‌కు రంగా పేరు పెట్టండి : సీఎంకు షర్మిల లేఖ 06



అర్చకుడిపై దాడి.. ధర్మ పరిరక్షణపై దాడిగా భావించాలి 06

# పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ దాఖలు

**ఏలూరు, మహానాడు:** కలెక్టర్ ఆఫీస్‌లో ఉభయ గోదావరి జిల్లాల ఎన్డీఏ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం సోమవారం నామినేషన్ దాఖలు చేశారు.

కేంద్ర ఉక్కు కర్మాగారం సహాయక కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మన రామానాయుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఉమ్మడి గోదావరి జిల్లాల ఎన్డీఏ కూటమి పార్టీల శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా లేదు

- 60 రోజులు అసెంబ్లీ రాకుండా ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చు
- వైసీపీలో మిగతా ఎమ్మెల్యేలకు జగన్ మాట్లాడే అవకాశం ఇవ్వాలి
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**ఢిల్లీ:** అసెంబ్లీలో సీఎం చంద్రబాబుకు ఎంత సమయం ఇస్తారో, తనకూ అంత సమయం ఇవ్వాలని జగన్ అడుగుతున్నారు. అసలు జగన్‌కు ప్రతిపక్ష నేత హోదాయే లేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. వైసీపీ నేతలు మాటలు

మిగతా.. 2లో



ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు.. ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.




# వికసిత్ భారత్ లక్ష్యంగా ‘బోద’ను నిర్మూలిద్దాం!

- 2030 నాటికి దేశంలో వ్యాధి విస్తరణను పూర్తిగా నిర్మూలించేందుకు సమిష్టి కృషి అవసరం
- దేశవ్యాప్తంగా 111 జిల్లాల్లో మందుల పంపిణీ
- ఏపీలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రెండు మండలాల్లో కార్యక్రమం
- ఈ ఏడాది మొదటి విడత మందుల పంపిణీని ప్రారంభించిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా
- 2030 నాటికి రాష్ట్రంలో అరికడతాం.. రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్
- రాష్ట్రంలో 41 వేల బోదకాలు బాధితులు
- గత దశాబ్దంలో దాదాపు 200 మందికి వ్యాధి సంక్రమణ

**అమరావతి, మహానాడు:** దేశ వ్యాప్తంగా 2030 నాటికి బోదకాలు వ్యాధి విస్తరణను అరికట్టే కార్యక్రమంలో భాగంగా 13 రాష్ట్రాల్లోని 111 జిల్లాల్లో ఈ వ్యాధి నివారణ మందుల పంపిణీని చేపట్టారు. మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌గా పిలవబడే ఈ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పాటు అన్ని రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా దేశం ముందుకు సాగుతున్నందున 2030 నాటికి

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ మంగళవారం 11, ఫిబ్రవరి 2025 ‖


## ప్రకాష్ రెడ్డి, గోరంట్ల మాధవ్
# నోరు అదుపులో పెట్టుకోండి

- గుంతపల్లి ఘటనను రాజకీయం చేసి మాపై నెట్టుతారా..?
- మా దృష్టి అభివృద్ధి వైపు ఉంది.. మీపై వచ్చేలా చేసుకోవద్దు
- మీ ఆధిపత్య పోరులోకి మా కుటుంబాన్ని ఎందుకు తీసుకొస్తారు
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరిక



**రాప్తాడు:** మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. అనంతపురం నగరంలోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా వారు చేస్తున్న వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు.

కనగానపల్లి మండలం గుంతపల్లి గ్రామంలో వ్యక్తిగత కారణాలతో జరిగిన గొడవను రాజకీయం చేస్తూ.. మా కుటుంబంపై విమర్శలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ ఘటనలో రెండు వైపుల వారికి గాయాలయ్యాయని.. దానిని మేము వైసీపీ చేసిన దాడిగా చెప్పలేద న్నారు. గతం నుంచి వారి మధ్య మనస్పర్థలు, వ్యక్తిగత కారణాలతో గొడవ పడితే తెలుగుదేశం పార్టీకి, పరిటాల కుటుంబానికి ఆపాదిస్తారా అంటూ నిలదీశారు. గత ఐదేళ్లలో మీరు ఎన్ని దాడులు చేశారో.. ఎంత మంది మీద అక్రమ కేసులు పెట్టించారో లెక్కే లేదన్నారు.

పైగా పోలీసుల గురించి, పోలీస్ వ్యవస్థ గురించి ప్రకాష్ రెడ్డి మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందన్నారు. పోలీస్ వ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థల్ని నాశనం చేయడంతో పాటు వాటిని మీ స్వార్థం కోసం వాడుకున్న సంగతి మర్చిపోయారా అంటూ ప్రశ్నించారు. గోరంట్ల మాధవ్ ఇప్పుడు నిద్రలేచి కబడ్దార్ అంటూ అరుస్తున్నారని సునీత ఫైర్ అయ్యారు. గతంలో మీరు చేసిన వాటి గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత బాగుంటుందన్నారు. సభ్యత, సంస్కారం ఉంది కాబట్టి చెప్పడం లేదన్నారు. గత ఐదేళ్లలో మీరు ఎన్ని అరాచకాలు, దౌర్జన్యాలు చేసినా వాటిని పట్టించుకోకుండా తాము నియోజకవర్గ అభివృద్ధి గురించి మాత్రమే దృష్టి పెట్టామన్నారు.

అదే మీరు చేసిన వాటికి ప్రతీకారం తీర్చుకోవాలని ఆలోచన వచ్చినా.. లేదా మీరన్నట్టు రాజకీయంగా చూడాల్సి వస్తే ఆ కథ వేరేలా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం ఓ వైపు ప్రకాష్ రెడ్డి, ఇంకో వైపు గోరంట్ల మాధవ్ ప్రాకులాడుతున్నారని.. వారిలో వారికే పొసగక అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఎక్కడైనా చిన్నచిన్న సంఘటనలు జరిగితే దానికి రాజకీయాల్ని ఆపాదించుకుంటూ అమాయక కార్యకర్తల్ని పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు.

ఎక్కడైనా చిన్న చిన్న గొడవలు జరిగినా వాటిపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా మీరు నోరు అదుపులో పెట్టుకోవాలని ఎమ్మెల్యే సునీత హెచ్చరించారు

# రేవంత్.. కేసీఆర్‌కు సెంటి‘మంట’

మొదటి పేజీ తరువాయి..

పనిలేదు. దానితో ఎదురుదాడికి దిగిన రేవంత్ వర్గం.. కేసీఆర్ లక్ష్యంగా అదే సెంటి ‘మంట’ను రగిల్చింది. అంటే.. మా రేవంత్‌ది ఒక్కటే కాదు. మీ కేసీఆర్‌దీ ఐరన్‌లెగ్గే’నని చెప్పడం దాని లక్ష్యమన్న మాట! ఆ ప్రకారంగా కేసీఆర్‌ది కూడా ఐరన్‌లెగ్గేనన్నది, రేవంత్ సోషల్‌మీడియా బృందం కవిహృదమన్నమాట.

నిజానికి కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా వీక్. అయితే రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సోషల్‌మీడియా టీమ్ పవర్‌ఫుల్. ఆయనను పైకి లేపేందుకు కొన్ని దళాలు నిరంతరం అవిశ్రాంతంగా పనిచేస్తుంటాయి. ఆ దళాలు కాంగ్రెస్ పార్టీ కంటే, రేవంత్‌ను వ్యక్తిగతంగా పైకిలేపడానికే కృషి చేస్తుంటాయన్నది బహిరంగ రహస్యమే. రేవంత్‌ది ఐరన్‌లెగ్ అంటూ, సోషల్‌మీడియాలో సెంటి‘మెంట’ రగిల్చిన బీఆర్ఎస్ ప్రచారానికి ధీటుగా.. రేవంత్ సోషల్‌మీడియా దళం కూడా, బీఆర్ఎస్‌కు అదే సెంటి‘మంట’ పెట్టడం ఆసక్తికరంగా మారింది. అందులో భాగంగా కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కలిసిన ప్రముఖులందరూ ఓడిపోయారంటూ.. “తనతో పాటు నలుగురిని వెంటతీసుకెళ్లడమంటే ఇదేనేమో” నన్న వ్యంగ్యాస్త్రంతో, ఎదురుదాడికి తెరలేపింది.

సీఎంగా కేసీఆర్ కత్తికి ఎదురులేని రోజుల్లో.. ఆయన అప్పటి ఒడిషా సీఎం పట్నాయక్, ఏపీ సీఎం జగన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ థాక్రే, కర్నాటక మాజీ సీఎం కుమారస్వామిని కలసిన ఫొటోలు పెట్టారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వారు నాయకత్వం వహించిన పార్టీలు మట్టికరిచాయి. అంటే.. కేసీఆర్ కలిసిన వారంతా ఎన్నికల్లో మట్టికరిచారన్నది, రేవంత్ సోషల్‌మీడియా దళం కవిహృదయమన్నమాట.

ఏదైతేనేం.. సెంటిమెంట్‌లో దొందూ దొందేనన్నది నెటిజన్ల కామెంట్లు. కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య సోషల్‌మీడియా వేదికగా జరుగుతున్న ఈ సెంటిమెంట్ యుద్ధాన్ని, బీజేపీ మహదానందంగా తిలకిస్తోంది. ఈ ఐరన్‌లెగ్ సెంటిమెంట్ ప్రచారం ఎంత విస్తృతంగా జనక్షేత్రంలోకి వెళితే, తనకు రాజకీయంగా అంత లాభమన్నది కమల దళాల అసలు ఆనందం. ఎవరి తుత్తి వారిది మరి!

**కరీంనగర్ లో పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి నామినేషన్ ర్యాలీలో ముఖ్య అతిథిగా టిపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , సహచర మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి , కొండా సురేఖ ,జూపల్లి కృష్ణారావు, సీతక్క గార్లతో మరియు ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ లతో కలిసి పాల్గొన్నారు.**





**ఏలూరులో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఎమ్మెల్సి నామినేషన్ కార్యక్రమంలో మంత్రులు, సహచర ఎమ్మెల్యేతో పాటు పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విప్ & ముమ్మిడివరం నియోజకవర్గ శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు**



**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాజస్థాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్ పైలట్**

# సంపద సృష్టి అంటే ఇదేనా బాబుగారు!?

### బిసివై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్



**అమరావతి:** అధికారంలోకి రాకముందు విద్యుత్తు ధరలు తగ్గిస్తాం” అన్నారు.. అధికారంలోకి వచ్చాక ఇప్పటికే సర్దుబాటు పేరిట రెండు సార్లు విద్యుత్తు చార్జీలు పెంచారు.అధికారంలోకి రాకముందు మద్యం ధరలు తగ్గిస్తాం అన్నారు..అధికారంలోకి వచ్చాక తగ్గించినట్టే తగ్గించి మళ్ళీ ఈరోజు 15% పెంచేశారు.

అధికారంలోకి రాకముందుమెగా డీఎస్సీపై తొలి సంతకంఅన్నారు. అధికారంలోకి వచ్చాక సంతకం చేశారు, కానీ ఇప్పటికి నోటిఫికేషన్ లేదు. అధికారంలోకి రాకముందు అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు అన్నారు... అధికారంలోకి వచ్చాక “ఈ 8 నెలల్లో కనీసం 20 వేల మందికైనా ఉద్యోగాలు ఇచ్చారా!?

అధికారంలోకి రాకముందు సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఊరించారు.. అధికారంలోకి వచ్చాక ”నిధులు లేవు, ఆర్థిక ఇబ్బందులు అంటూ మొసలి కన్నీళ్లు. ఏం ప్రతిపక్షంలో ఉండగా ఆర్థిక పరిస్థితి తెలియలేదా!?

ఇలా చెప్పుకుంటూ వెళితే మీ ఏరు దాటాక తెప్ప తగలేసే మీ బుద్ధులు పోవు.. అందుకే మీ ప్రభుత్వం తక్కువ సమయంలోనే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంది. బీసీవై పార్టీ అన్ని వర్గాలకు అండగా ఉంటుంది.. మీ ప్రతి వైఫల్యాన్ని ప్రశ్నిస్తుంది.

# త్వరితగతిన డేటా అనుసంధానం



మొదటి పేజీ తరువాయి..

నేరస్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు కీలక పాత్రపోషిస్తాయన్నారు. నేరం జరిగిన వెంటనే సమీప పోలీసు స్టేషన్ ఉన్నతాధికారికి అలర్ట్ మెసేజ్ వెళ్లి, నేరస్థులు పారిపోకుండా పట్టుకునేందుకు సీసీ కెమెరాలు సహాయపడేలా రూపకల్పన చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపైన కూడా ముందుగానే నిఘా పెట్టి, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్టీజీఎస్ సీఈఓ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఆర్టీజీఎస్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు ఏఏ దశల్లో ఉన్నాయో ముఖ్యమంత్రికి వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను విస్తృతంగా వినియోగించుకోవడానికి గూగుల్ సంస్థ సహకారం అందిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్త, సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకుడు హిమాంశు శుక్లా, జీఎస్ డబ్ల్యూ డైరెక్టర్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యంగా ‘బోద’ను నిర్మూలిద్దాం!

మొదటి పేజీ తరువాయి..

దేశంలో బోదకాలు విస్తరణను పూర్తిగా నిర్మూలించే సమిష్టి ప్రయత్నం విజయం సాధించేందుకు రాష్ట్రమంత్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రజల భాగస్వామ్యంతో బోదకాలు వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వ్యాధి నిర్మూలన లక్ష్య సాధనకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఆరోగ్య శాఖా మంత్రి హామీ ఇస్తూ... ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్ని వివరించారు. మంగళగిరి ఏపీఐఐసీ టవర్స్ ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి జరిగిని వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జి.వీం పాండియన్, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే బోదకాలు నిర్మూలనకు ప్రతి ఏడాదీ ఫిబ్రవరి, ఆగస్టు మాసాల్లో వ్యాధి నిరోధక మందుల సరఫరా జరుగుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని విజయనగరం జిల్లా గుర్ల, పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలాల్లో మందుల పంపిణీ చేపట్టారు. రెండేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారిని మినహాయించి ఇతరులందరికీ మందులు పంపిణీ చేస్తారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వయసును బట్టి తగు మోతాదులో డీఈసీ(డై ఇథైల్ కార్బామజైన్) అల్బెండజోల్ బిళ్లలను పంపిణీ చేస్తారు. ఈ మేరకు గుర్ల మండలంలో 61,015 మందికి, బలిజిపేట మండలంలో 57,875 మందికి బోదకాలు నివారణ మందుల పంపిణీ చేపట్టారు. మొత్తంగా 4,16,116 మందు బిళ్లల్ని పంపిణీ చేయాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో మొత్తం 40,877 బోదకాలు వ్యాధి గ్రస్థులున్నారు. ఈ వ్యాధి నిరోధక కార్యక్రమాల ఫలితంగా వ్యాధి విస్తరణ తగ్గుముఖం పట్టి 2014 నుండి 196 మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. ఇందులో అత్యధికంగా అవిభక్త విజయనగరం జిల్లాలో ఈ కాలంలో 77 మందికి బోదకాలు వ్యాధి సంక్రమించింది. 50 మంది వ్యాధి గ్రస్తులతో తూర్పు గోదావరి జిల్లా రెండో స్థానంలో ఉంది. కేంద్రం రూపొందించిన నియమాలమేరకు ఒక శాతం కంటే ఎక్కువ మంది ప్రజలకు బోదకాలు వ్యాపిస్తే ఆ ప్రాంతాల్లో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపడతారు.

### పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి

ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ బోదకాలు వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించే పోస్టర్లు, కరపత్రాల్ని విడుదల చేశారు. వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సియస్ ఎం.టి.కృష్ణ బాబు, కమీషనర్ జి.వీరపాండియన్, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్.. దమ్ముంటే రాజీనామా చెయ్

మొదటి పేజీ తరువాయి..

పదవికి రాజీనామా చేసి పట్నం నరేందర్ రెడ్డిపై పోటీ చేస్తే కొడంగల్ ప్రజలే తీర్పు చెపుతారన్నారు. 50 వేల మెజార్టీకి ఒక్క ఓటు తగ్గినా తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ ఛాలెంజ్ చేశారు.

కౌరవ రాజు దుర్యోధనుడు లాగా సంవత్సర కాలంగా అరాచకాలు చేస్తున్న రేవంత్ రెడ్డికి ఎదురొడ్డి కొడంగల్ ఆడబిడ్డలు అన్నదమ్ములు పోరాడుతున్నారు. సంవత్సర కాలంగా లగచర్ల ,కొడంగల్ లో కురుక్షేత్ర యుద్ధం నడుస్తుంది. 14 నెల పదవీకాలంలో రైతులు ,మహిళలు, వృద్ధులు, యువత కోసం రేవంత్ రెడ్డి ఒక పని కూడా చేయలేదు.

అనుముల అన్నదమ్ముల కోసం,అల్లుడి కోసం, ఆదానికోసం, బామ్మర్దుల కోసం ,ఆయన కుటుంబ సభ్యులకు వందల వేల కోట్లు దోచిపెట్టడానికి కొడంగల్ భూములు ధారాదత్తం చేయడానికి రేవంత్ రెడ్డి బ్రహ్మాండంగా పనిచేస్తున్నాడు. కొడంగల్ నియోజకవర్గంలో తొండలు కూడా గుడ్లు పెట్టవని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పిండు. కానీ ఎక్కడ చూసినా పచ్చని పంట పొలాలతో కొడంగల్ నియోజకవర్గం కళకళలాడుతుంది.



రైతు రుణమాఫీ కి ఇచ్చే నిధుల విషయంలోనూ రేవంత్ ప్రభుత్వం గోల్మాల్ చేసింది. మొత్తం రుణమాఫీకి 49,500 కోట్ల రూపాయలు అవసరమైతే కేవలం 11 వేల కోట్లు మాత్రమే ఇచ్చి ప్రభుత్వం గప్పాలు కొట్టుకుంటుంది. చారాన మందం కూడా రుణమాఫీ కాలేదు.తులం బంగారం ఇయ్యలేదు. స్కూటీ లేదు రుణమాఫీ చెయ్యలేదు.

కెసిఆర్ 12సార్లు రైతుబంధు ఇచ్చిండు. 73000 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో కెసిఆర్ గారు వేశారు.మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా రైతుబంధు కోసం 7600 కోట్ల రూపాయలను జమచేసి కెసిఆర్ పెట్టారు. రైతుబంధును వేయనీయద్దని ఎలక్షన్ కమిషన్కు ఫిర్యాదు చేయడంతో బడే భాయ్ మోడీ చోటే బాయ్ రేవంత్ చెప్పిండని రైతుబంధు వేయకుండా ఆపిండు.

పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయించుకోవడానికి నాలుగు నెలలు ఆపి రైతుబంధు పేరిట నోట్లు రైతుల ఖాతాల్లో రేవంత్ రెడ్డి వేసిండు. తెలంగాణ రైతులకు ఎకరానికి 17,500 రేవంత్ రెడ్డి బాకీ ఉన్నాడు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు అయిపోయాయి అంటే రేవంత్ రెడ్డి రైతుబంధు వెయ్యడు. రైతు భరోసా కింద 15000 ఇస్తానని 12000 ఇస్తున్న రేవంత్ రెడ్డి మీద చీటింగ్ కేసు పెట్టాలి.

అల్లునికి కట్నం కింద లగచర్ల భూములు ఇవ్వడానికి రేవంత్ రెడ్డి సూటి పెట్టిండు.లంబాడి ఆడబిడ్డలు గడప దాటి బయటకు రారు అలాంటి వాళ్లను ఢిల్లీ వెళ్లి న్యాయం కోసం అడిగేలా రేవంత్ రెడ్డి దుర్మార్గంగా వ్యవహరించాడు. అదానీ కంపెనీకి, అల్లుడి ఫార్మ కంపెనీకి భూములు గుంజుకోవడానికి రేవంత్ ప్రభుత్వం కుట్రలు చేస్తుంది.

ఎకరం 60 – 70 లక్షలు విలువ చేసే భూములకు 10 లక్షలు పరిహారం ఇవ్వడం ఏంటని అడిగినందుకు లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు బనాయించారు.కాంగ్రెస్, బిజెపి నాయకులను వదిలేసి కేవలం బీఆర్ఎస్ నేతలపైనే అక్రమంగా రేవంత్ ప్రభుత్వం కేసులు పెట్టింది. కొడంగల్ రైతుల కోసం పట్నం నరేందర్ రెడ్డి జైలుకు పోయిండు.

అర్ధరాత్రి పోలీసులను ఊరు మీదికి పంపి లంబాడి ఆడబిడ్డలను రేవంత్ రెడ్డి అవమానించాడు. లగచర్ల జ్యోతి శివంగిలాగా ఢిల్లీలో లడాయి చేసింది. బంజారా ఆడబిడ్డల పోరాటంతోనే లగచర్ల రైతులకు న్యాయం జరిగింది. తన బిడ్డకు పేరు పెట్టమని జ్యోతి అడగడంతో.. భూ పోరాటంలో పుట్టింది కాబట్టి ఆమెకు భూమి పేరు పెట్టాను. కొడంగల్ రైతుల భూ పోరాటానికి బిఆర్ఎస్ అండగా నిలబడింది.

వచ్చే ఎన్నికల్లో కొడంగల్ ఆడబిడ్డలు రేవంత్ రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడిస్తారు. ఎప్పుడు ఎన్నిక వచ్చిన కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని కొడంగల్ తో పాటు తెలంగాణ మొత్తం ఎదురుచూస్తుంది. అన్ని హామీలు అమలు చేస్తున్నా అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డికి దమ్ముంటే కొడంగల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి.

పట్నం నరేందర్ రెడ్డి ప్రచారం కూడా చేయడు ఇంట్లోనే ఉంటాడు. అయినా సరే ఆయనకు 50 వేల మెజారిటీకి ఒక్క ఓటు తక్కువ వచ్చిన నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. అడ్డి మారి గుడ్డి దెబ్బలాగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. రేషం లేని బతుకు రేవంత్ రెడ్డిది.లంకె బిందెలు ఉన్నాయి అనుకుని అడ్డమైన హామీలు ఇచ్చానని రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నాడు.

పట్నం నరేందర్ రెడ్డి రైతుల కోసం,బంజారా అన్నదమ్ముల కోసం జైలుకు పోతే రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలను కొంటూ 50 లక్షల రూపాయలతో అడ్డంగా దొరికిండు. నేను చెప్పే మాటలు నిజం కాదు అని నిరూపించాలనుకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రేవంత్ రెడ్డి మళ్ళీ ఎన్నికలకు పోవాలి. రేవంత్ రెడ్డి పై పట్నం నరేందర్ రెడ్డి పోటీ చేస్తారు. ఎవరు గెలుస్తారో కొడంగల్ ప్రజలే నిర్ణయిస్తారు.

నాయి బ్రాహ్మణులు, రజకులకు కేసీఆర్ గారు 200 యూనిట్ల కరెంటును ఉచితంగా ఇచ్చారు.. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి వాళ్లను డబ్బులు కట్టమని వేధిస్తున్నాడు. వాళ్లంతా కేసీఆర్ గారిని కలిసి మొరపెట్టుకుంటున్నారు. రుణమాఫీ 100కు 100% జరిగిందని ఏ ఊర్లోనైనా రైతులు చెప్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని నేను రేవంత్ రెడ్డికి చాలెంజ్ చేశాను.

కల్వకుర్తి పక్కన వెల్దండలో తన కున్న సొంత భూముల్లో రేవంత్ రెడ్డి ఫార్మ కంపెనీలు పెట్టాలి. ప్రభుత్వం ఇచ్చే 20 లక్షలకు టిఆర్ఎస్ పార్టీ తరఫున ఇంకో ఐదు లక్షలు కలిపి ఇస్తాము వాటిని తీసుకొని రేవంత్ రెడ్డి తన సొంత భూముల్లో ఫార్మ కంపెనీని పెట్టాలి.

అదాని కోసం, అనుముల అన్నదమ్ముల కోసం కొడంగల్ ను ఇష్టం వచ్చినట్టు వాడుకుంటానంటే ఒప్పుకునేది లేదు. నీ అయ్యా మీ తాత జాగిరు కాదు. కెసిఆర్ ఉన్నంతకాలం తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగితే గద్దల్లా వాలి పోరాడుతాం.దామరగిద్ద తండా రైతుల కోసం కూడా పోరాడుతాం. 4350 కోట్ల రూపాయలతో కొడంగల్ కు నీళ్లు తెస్తానని రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నాడు కానీ కాంట్రాక్టర్లకు ఆయన మనుషులకు కమిషన్ ఇవ్వడానికి తప్ప కొడంగల్ ప్రజల కోసం అయితే కాదు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో 1,53,000 ఎకరాలకు నీళ్లు ఇచ్చే సౌలత్ ని కేసీఆర్ గారు చేశారు 90% పనులు పూర్తయ్యాయి 10% పనులు పూర్తయితే ప్రజలకు నీళ్లు వస్తాయి.

# జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా లేదు

మొదటి పేజీ తరువాయి..

వింతగా ఉన్నాయని విమర్శించారు. ఈ నెల 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమా వేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. జగన్ అసెంబ్లీ నియమ నిబంధనలు తెలుసుకోవాలని, ఎలాంటి అనుమతి లేకుండా 60 రోజులు అసెంబ్లీ రాకుండా ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని వెల్లడించారు. నిర్దిష్ట కారణం వల్ల అసెంబ్లీకి రాలేకపోతున్నాను అంటూ స్పీకర్ కు లేఖ ఇవ్వాలని, సభ్యుల లేఖలో సహేతుక కారణం ఉంటే స్పీకర్ అనుమతి ఇస్తారని వివరించారు. సభకురాని సభ్యులు వ్యక్తిగతంగా లేఖలు ఇవ్వాల్సి ఉంటుందని, అలాగని, అసెంబ్లీ హాజరు జాబితాలో నకిలీ సంతకాలు పెట్టేందుకు కుదరదని స్పష్టం చేశారు. సభకు వచ్చి సమస్యలపై మాట్లాడాలని జగన్ ను, వైసీపీ నేతలను కోరుతున్నా. వైసీపీలో మిగతా ఎమ్మెల్యేలకు జగన్ మాట్లాడే అవకాశం ఇవ్వాలని, వారి నియోజకవర్గాల సమస్యలను చెప్పుకునే అవకాశం ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు సూచించారు.



03

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, ఫిబ్రవరి 2025

# రైతుల గురించి మాట్లాడకండి.. నవ్వుకుంటున్నారు

- బీఆర్ఎస్ నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చురక



హైదరాబాద్: పదేళ్ల అధికారంలో ఉండి, ఇప్పుడు అధికారం పోయేసరికి ఎప్పుడు రైతుల మధ్యకురాని నేతలు ఇప్పుడు బయటికి వచ్చి రైతాంగ సమస్యల మీద మాట్లాడటం చూసి, తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారు.

ఈ సంవత్సర కాలంలో రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, వాటికోసం ఖర్చు చేసిన నిధులు రూ. 55,256 కోట్లు. ఇప్పటివరకు ప్రత్యక్షంగా రైతులకు నేరుగా ఖాతాలలో జమ చేసింది రూ.40,000 కోట్లు. దేశంలో ఏ రాష్ట్రంలోనైన, ఏ ప్రభుత్వంలోనైన స్వాతంత్ర్యం వచ్చిననాటి నుండి ఈ రోజు వరకు ఇన్ని నిధులు ఒక్క రైతు సంక్షేమం కోసమే ఖర్చు పెట్టిన ప్రభుత్వాన్ని చూపెట్టగలరా?

పావలా రుణమాఫీ అని ప్రతిసారి విమర్శించే నాయకులు, 2018 రుణమాఫీ ఏ సంవత్సరం మొదలుపెట్టి ఏ సంవత్సరం వరకు ఎంత మందికి చేశారో చెప్పి ఈ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఒక్క విశ్వసనీయత ఉండేది. 2018 లో చేయాల్సిన రుణమాఫీని ఎలక్షన్లలో లబ్ధి కోసమే ఆఖరి సంవత్సరమైన 2023 సంవత్సరంలో సగం మందికి చేసిన మీరా ఈ ప్రభుత్వాన్ని విమర్శించేది. 4 సంవత్సరాల పాటు చారానా చొప్పున చేయడంతో 2014లో రుణమాఫీతో రైతులపై రూ. 2630 వడ్డీభారం పడింది నిజమా, కాదా అని మీ దీక్షలలో అడిగి తెలుసుకోండి. 2018 రుణమాఫీ, 4 సంవత్సరాలు ఆగి ఆఖరి సంవత్సరములో చేయడం వలన రూ. 8315 కోట్లు వడ్డీ భారం రైతులపై వేసింది కూడా మీరా, కాదా అని అడిగితే అప్పుడు సమాధానాలు మీకు సరిగ్గా వస్తాయి.

ఓఆర్ఆర్ ని కుదువపెట్టి మరీ ఎన్నికలలో లబ్ధి పొందాలనే ఆలోచన చేసిన బిఆర్ఎస్ పెద్దలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంకి వచ్చిన మొదటి పంటకాలంలోనే 25,35,964 మంది రైతులకి రూ.20,616.89 కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిన విషయాన్ని దాచిపెట్టడానికి, అర్థం పర్థం లేని చవాకులతో, అవాస్తవాలతో మాటల గారడీలతో దీక్షలు చేస్తూ, తెలంగాణ సమాజానికి ముఖ్యంగా రైతాంగాన్ని మభ్యపెట్టడానికి పడుతున్న కుస్తీలను చూసి అందరూ నవ్వుకుంటున్నారు.

అధికారంలో ఉన్న 10 సంవత్సర కాలంలో రైతుబంధు, రుణమాఫీకి మీరు చేసిన ఖర్చెంత? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక్క సంవత్సరంలోనే ఖర్చు పెట్టింది ఎంతో బేరీజు వేసుకుంటే మీరు రైతుల మధ్యకు వచ్చి మాట్లడగలరా.?

వాళ్ల పదవికాలంలో విపత్తులు సంబవించి పంటలు పూర్తిగా నష్టపోయి సందర్భంలోను రైతులను ఆదుకునే ప్రయత్నం ఏనాడైనా చేశారా మ్యాచింగ్ గ్రాంటు విడుదల చేయకుండా, ఒక్క రైతు బంధు పేరు చెప్పి రైతులను మిగతా అన్ని పథకాలకు దూరం చేసింది మీరు కాదా? మీరు చేసిన నిర్వాకం వలన రాష్ట్ర రైతాంగం నష్టపోయిన రూ. 3000 కోట్లకు మీరు సమాధానం చెప్పగలరా?

వరి ఏస్తే ఉరి అని చెప్పినా బిఆర్ఎస్ నాయకులు, బోనస్ గురించి మాట్లాడటం చూస్తుంటే ఏటి ఇసుక ఎంచలేం, తాటి మాను తన్నలేం, బిఆర్ఎస్ నాయకుల బుద్ధి మార్చలేం అన్నట్లు ఉంది. కందులు ఒక్కటే కాదు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరకాలంలో రైతులు పండించే ప్రతి పంటను మద్ధతు ధరతో కొనుగోలు చేస్తున్నాము.

ఈ సంవత్సర కాలంలో రూ. 412.62 కోట్లు వెచ్చించి రైతుల వద్ద నుంచి వివిధ పంటలను సేకరించాము. బిఆర్ఎస్ నాయకులు ఆరోపించినట్లు కందుల కోసం 4 సెంటర్లు కాదు, 41 సెంటర్లు ఇప్పటికే ఆరంభించాము. రూ. 7.21 కోట్లతో 954.95 మెట్రిక్ టన్నుల కందులను మద్ధతు ధరకు కొనుగోలు చేశాము.

ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు అవాస్తవాలు మాట్లాడటం మానకపోతే, తెలంగాణ సమాజం మరొకసారి కర్రుకాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉందని గ్రహిస్తే వారికే మంచిది




## 24న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం

- 2025-26 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్
- 28న బడ్జెట్

అమరావతి: కూటమి సర్కార్ పూర్తి స్థాయిలో బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు సిద్ధమవుతోంది. గత జులైలో చంద్రబాబు ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడానికి అసెంబ్లీ సమావేశాలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలయింది. ఈ నెల 28న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈనెల 24న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాను న్నాయి. గవర్నర్ ప్రసంగంతో శాసనసభ సమావేశాలు మొదల వుతాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ప్రభుత్వ విప్ లతో చీఫ్ విప్ సమావేశం కానున్నారు. సమావేశాల నిర్వహణపై వీరు ప్రధానంగా చర్చించనున్నారు. 24న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం తర్వాత, బీఏసీ సమావేశం నిర్వహించి సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై నిర్ణయం తీసుకుంటారు.



## నమస్తే అయ్యగారూ..

- రంగరాజన్‌కు రేవంత్ రెడ్డి ఫోన్

హైదరాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగ రాజన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్ చేసి పరామర్శించారు. ఆయనపై జరిగిన దాడి ఘటనపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. దాడి చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

రంగరాజన్ నమస్తే సర్, నమస్తే అనగానే... ముఖ్యమంత్రి "నమస్తే అయ్యగారూ" అని పలకరించారు. ఇలాంటి ఘటన జరిగినప్పుడు చెప్పాల్సింది కదా అని ముఖ్యమంత్రి అడిగారు. అందుకు రంగరాజన్ స్పందిస్తూ.. మీరున్నారు కదా? పోలీసులు కూడా బాగా పనిచేస్తూనే ఉన్నారు అని బదులిచ్చారు. " మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు .దాడి చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.. ఎమ్మెల్యేకు కూడా సూచన చేశా. ఒకసారి వీలు చూసుకొని చిలుకూరు బాలాజీ ఆలయానికి వస్తానని ముఖ్యమంత్రి చెప్పారు. జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సహకారం అవసరమైతే తమకు చెప్పాల"ని ఆయన అన్నారు.



# కేసీఆర్ పాలన ఐఫోన్... రేవంత్ రెడ్డి పాలన చైనా ఫోన్

- మాటలు చెప్పి బీసీల ఓట్లు వేయించుకొని బూరడి కొట్టిన సీఎం రేవంత్ రెడ్డి
- బీసీ సమాజమంతా అట్టుడుకుతోంది
- బీసీలంతా తెలంగాణ ఉద్యమం తరహా ఉద్యమానికి సిద్ధం కావాలి
- కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ 3.0. వస్తది.. కెసిఆర్ 3.0 వస్తారు
- ఎవ్వరూ దిక్కు లేనప్పుడు గులాబీ జెండా మోసిన ఉద్యమకారులకు ఖచ్చితంగా న్యాయం జరగాల్సిందే..
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు

జగిత్యాల: కేసీఆర్ పాలన ఐఫోన్ లా ఉంటే... రేవంత్ రెడ్డి పాలన చైనా ఫోన్‌లా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎద్దేవా చేశారు. ఐఫోన్‌కు, చైనా ఫోన్‌కు ఎంత తేడా ఉంటదో... కేసీఆర్‌కు, రేవంత్ రెడ్డికి అంత తేడా ఉందని, చైనా ఫోన్ చూడడానికే బాగుంటుంది కానీ సరిగ్గా పనిచేయదని చెప్పారు.

సోమవారం జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. మాయ మాటలు చెప్పి బీసీల ఓట్లు వేయించుకొని సీఎం రేవంత్ రెడ్డి బూరడి కొట్టించారని ధ్వజమెత్తారు. తప్పుడు జనాభా లెక్కలు చెప్పడంతో బీసీ సమాజం అట్టుడుకుతోందని, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే బీసీ కుల సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీల జనాభా 52 శాతం ఉందని 2014లోనే కేసీఆర్ చేపట్టిన సర్వేలో తేలిందని, కానీ లెక్కపెట్టడం కూడా రాని రేవంత్ రెడ్డి సర్కారు తప్పుడు లెక్కలు చెబుతోందని అన్నారు.

బీసీల సంఖ్యను తక్కువ చూపించడం శోచనీయమని స్పష్టం చేశారు. ఈ తప్పుడు లెక్కలు చెప్పి రాహుల్ గాంధీ పార్లమెంటును తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి బిల్లు ఎందుకు పెట్టడం లేదు? అని ప్రశ్నించారు. ఏ కులంలో ఎంత జనాభా ఉన్నారో లెక్కలు ఎందుకు బయటపెట్టడం లేదు ? అని నిలదీశారు. తూతూమంత్రంగా మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంఘాలతో సమావేశం పెట్టారని, స్వయంగా ముఖ్యమంత్రి ఎందుకు సమావేశమవ్వడం లేదు ? అని అడిగారు.

బీసీ ఉద్యమం చేస్తున్న నాయకులతో ముఖ్యమంత్రి మాట్లాడక పోవడం బీసీలను అవమానించడమేనని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. మరో తెలంగాణ పోరాటం తరహా పోరాటానికి బీసీలంతా సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు.

420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించిందని మండిపడ్డారు. ఎండిపోయిన పొలాలను చూపిస్తూ రైతులు బాధపడుతున్నారని, ఎండిన పంటపొలాలను చూస్తుంటే కన్నీళ్లు వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ పై అక్కసుతో మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదని, రైతులను నీళ్లించే తెలివి లేదు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు.

రాజకీయ కక్షను పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్లలు స్కూటీలు, మహిళలకు 2500 ఏమయ్యాయని నిలదీశారు. మహిళలను చిన్నచూపు చూస్తున్న రేవంత్ రెడ్డికి కాలం గుణపాఠం చెబుతుందని, రేవంత్ రెడ్డి తప్పులను ప్రజలు లెక్కిస్తున్నారు.. తగిన సమయంలో బుద్ధిచెబుతారని తెలిపారు. రేషన్ కార్డులను ఎందుకు జారీ చేయడం లేదని ప్రశ్నించారు. రుణ మాఫీ ఎక్కడా కూడా సంపూర్ణంగా కాలేదని, రైతులంతా సీఎం రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ పార్టీపై ఆగ్రహంగా ఉన్నారని పేర్కొన్నారు.

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్ లో చేరారని విమర్శించారు. అయినా కూడా మనోధైర్యంతో కార్యకర్తలు చెక్కుచెదరలేదని, ఉప ఎన్నిక వస్తే జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోతుందని తెలిపారు. అనంతరం జగిత్యాల బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... కేసీఆర్ నాయ కత్వంలో బీఆర్ఎస్ 3.O. వస్తది.. కెసిఆర్ 3.0 వస్తారని తేల్చిచెప్పారు.

"మీ చెల్లెగా అక్కగా చెప్తున్న ఉద్యమ కారులందరికీ న్యాయం చేసే బాధ్యత నాది.. నా చేతిలో ఎక్కడ ఎలాంటి అవకాశమున్నా ఉద్యమ కారులకే మొదటి నుండి ప్రాధాన్యత ఇచ్చిన అని అన్నారు. ఎవ్వరూ దిక్కు లేనప్పుడు గులాబీ జెండా మోసిన ఉద్యమకారులకు ఖచ్చితంగా న్యాయం జరగాల్సిందే" అని భరోసా ఇచ్చారు.

విలేకరుల సమావేశంలో మరియు కార్య కర్తల సమావేశంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ దావ వసంతా సురేశ్, మాజీ మార్కెట్ చైర్మెన్ బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూలే వారసులైన మాలి కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

- డిప్యూటీ సీఎంకు మాలి సామాజిక వర్గ నేతల విజ్ఞప్తి

హైదరాబాద్: పూలే దంపతుల వారసత్వం కలిగిన మాలి కులస్తుల సమస్యలు పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పటేల్, ప్రధాన కార్యదర్శి షిండే తదితరులు సోమవారం హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో విజ్ఞప్తి చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో మాలి కులస్తులు ఎస్టీలుగా ఉండగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీసీల జాబితాలో చేర్చడంతో అన్ని రంగాల్లో వెనుకబడిపోయామని వారు విజ్ఞప్తి చేశారు. 2008లో వైయస్సార్ సీఎం గా ఉన్నప్పుడు జ్యోతిబాపూలే జయంతి వర్ధంతిలను అధికారికంగా నిర్వహించారని, ప్రగతి భవన్ కు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ గా పేరు మార్చి ప్రజాపాలనను అందించడం శుభ పరిణామం అని తెలిపారు. మాలి కులస్తులకు ఎస్టీ హోదా కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలి కులస్తులకు టికెట్లు కేటాయించాలని, హైదరాబాదులో మాలి ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించాలని కోరారు.

గత అనేక సంవత్సరాలుగా మాలి కులస్తులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, తెలంగాణ యూనివర్సిటీకి సావిత్రి పూలే బాయి తెలంగాణ యూనివర్సిటీగా నామకరణం చేయాలని, ట్యాంక్ బండ్ పై పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు.



సావిత్రి పూలే బాయి జన్మదిన జనవరి 3ని మహిళ ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించడం దేశ చరిత్రలోనే సంచలన నిర్ణయం అని.. మాలి కులస్తుల జాతీయ అధ్యక్షుడు విలాసరావు పాటిల్, సావిత్రి బాయ్ పూలే వంశీయులు డాక్టర్ దిలీప్ గణపతి పాటిల్ బృందం డిప్యూటీ సీఎం ఘనంగా సన్మానించారు.



# ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

- ఆర్యవైశ్యుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తాం
- పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ మంత్రి టిజి భరత్
- ఆర్యవైశ్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుంది
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి: ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలు పేర్కొన్నారు.

సోమవారం పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ మంత్రి టిజి భరత్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలు రాయచోటి పట్టణంలోని గాంధీ బజార్ నందు వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

గతంలో ఆర్యవైశ్యులను పట్టించుకునే వారే లేరని టిడిపి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. వీరి అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించేందుకు ప్రభుత్వంతో చర్చించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు పలు రకాలుగా ఇబ్బందులు పడి ఎంతో నష్టపోయారని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల, మత ప్రాంత భేదాలు లేకుండా అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.



మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ...మంత్రి టీజీ భరత్ పిలవంగానే రాయచోటి పట్టణానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజులలో ఇలాంటి మంచి కార్యక్రమాలు ఆయన చేతుల మీదుగా మరిన్ని ప్రారంభించాలని కోరుకుంటున్నానన్నారు.

గాంధీ బజార్లో ఎక్కువ మంది ఆర్యవైశ్యులు ఉన్నారని మీకు ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. రాబోయే రోజులలో రాయచోటి పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరుగుతుందని ఇందుకు ప్రతి ఒక్కరు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత ఇసుకను అందించేలా చర్యలు

- ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్న సీఎం
- ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే బాధ్యత హైడ్రాకు
- ఇసుక అక్రమ రవాణాపై విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ నిఘా
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలి. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అధికారులను ఆదేశించారు. బ్లాక్ మార్కెట్ ను అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఇసుక రీచ్‌ల వద్ద వెంటనే తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలన్న ముఖ్యమంత్రి..జిల్లాలవారీగా కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు.

హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే బాధ్యత హైడ్రాకు అప్పగించిన సీఎం..ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.. ప్రతీ ఇసుక రీచ్‌ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్ తో పాటు ఎంట్రీ, ఎగ్జిట్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రవాణాకు సంబంధించి రిజిస్టర్డ్ లారీలను ఎంప్యానెల్ చేసేలా చర్యలు చేపట్టాలి. ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోగా వినియోగ దారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలి.

ఏరియాల వారీగా సమీప ఇసుక రీచ్‌ల నుంచి వినియోగదారుడికి ఇసుక చేరేలా సిస్టం ఉండాలన్న సీఎం.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలి. సమస్య వచ్చిన వెంటనే పరిష్కారం జరిగేలా చూడాలి.

నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్ ను ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాలన్న సీఎం

ఆన్ లైన్ బుకింగ్ విధానంలో పలు మార్పులను సూచించిన సీఎం.

ఆఫీస్ టైమింగ్స్‌లో బుకింగ్ చేసుకునేలా బుకింగ్ వేళల్లో మార్పు చేయాలన్న సీఎం అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటుతప్పదన్న ముఖ్యమంత్రి ఎవ్వరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేసిన సీఎం అవసరమైతే తానే స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానన్న సీఎం పారదర్శకంగా అక్రమాలకు తావులేకుండా పర్మినెంట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలన్న సీఎం.

**కరీంనగర్ - మెదక్ - ఆదిలాబాద్ - నిజామాబాద్ గ్రాడ్యుయేట్ పరిధిలోని నియోజక వర్గ కార్యకర్తల సమావేశంలో టీపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కలిసి పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్,ఇతర మంత్రులు.. సమావేశానికి హాజరైన నాలుగు ఉమ్మడి జిల్లాల డిసిసిలు, ఇన్చార్జిలు, ఎన్ఎస్ యుఐ నేతలు, పట్టభద్రుల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన నేతలు**



జనం గుండె చప్పుడు

# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, ఫిబ్రవరి 2025 ||

## బీసీల నెత్తిపై కాంగ్రెస్ కత్తి

- బోగస్ సర్వేతో పోయింది కాంగ్రెస్ పరువే
- బడుగుల గొంతు కోసిన రేవంత్
- కాంగ్రెస్ తెలంగాణకు చీడ, ప్రజలకు పీడ
- బీసీలకు అండగా గులాబీ జెండా
- కామారెడ్డిలో కొడితే రేవంత్ రెడ్డి కోమాలోకి పోవాలి
- కులగణన రీసర్వే జరిగే వరకు పోరు ఆగదు
- మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



నిజామాబాద్: బీసీల నెత్తిపై కాంగ్రెస్ కత్తి వేలాడుతోందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారిని నిలువునా ముంచిందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. కులగణన పేరుతో ఇటీవల నిర్వహించిన బోగస్ సర్వేతో పోయింది కాంగ్రెస్ పరువేనని ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఎద్దేవా చేశారు.

ఏరు దాటిన తరువాత తెప్ప తగలబెట్టడం కాంగ్రెస్ నైజమని, బడుగులను ఏమార్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కారు వారి గొంతు కోసిందని ఆయన మండిపడ్డారు.

'కాంగ్రెస్ నిర్వహించిన కులగణన సర్వే బోగస్. రాజకీయ స్వార్థం, కుయుక్తులు లేకుండా రీసర్వే చేస్తేనే బీసీల జనాభా ఎంత అన్న విషయంలో ఖచ్చితమైన గణాంకాలు వెలుగు చూస్తాయి. బీసీల ఓట్ల కోసం వారిని ఏమార్చేందుకు పచ్చి అబద్ధాలతో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వెన్నుపోటు పొడిచింది. బీసీల జనాభాను ఐదున్నర శాతం తక్కువగా చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆత్మగౌరవం పైనే దెబ్బ కొట్టింది.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల హామీని రేవంత్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. కాంగ్రెస్ డ్రామాలో భాగంగా జరిగిన కులగణన చిత్తుకాగితం విలువ కూడా చేయదు. కాంగ్రెస్ కులతత్వ రాజకీయాలు చూసి బలహీన వర్గాల ప్రజలు తీవ్ర ఆందోళనల చెందుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రేషన్ కార్డుల మంజూరు, ఇండ్ల కేటా యింపుల్లో, ఆరు గ్యారంటీల వర్తింపులో తమ వాటా తగ్గుతుందనే భయం ఎంబీసీలు, బీసీ ప్రజల్లో నెలకొంది. బీసీ డిక్లరేషన్ పేరుతో కామారెడ్డి సభలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని, బీసీలకు లక్ష కోట్ల బడ్జెట్ పెడతామని, బీసీ సబ్ ప్లాన్ తీసుకొస్తామని కాంగ్రెస్ నమ్మబలికింది.

ప్రభుత్వ కాంట్రాక్టుల్లో, ప్రోక్యుర్మెంట్లలో 42% బీసీలకే ఇస్తామని కాంగ్రెస్ ఆశజూపింది. కానీ 15 నెలలు గడిచినా బీసీ డిక్లరేషన్ అమలు కోసం ప్రభుత్వం నయాపైసా కేటాయించలేదు.

కొత్తగా బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని ఒక్కో కార్పొరేషన్ 50 కోట్ల బడ్జెట్ ఇస్తామని ఇచ్చిన హామీలకు అతీగతీ లేదు. బీసీల జనాభాను

ఐదున్నర శాతం తగ్గించి దాదాపు 22 లక్షల మందిని లేనట్టుగా చిత్రీకరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ దుర్నీతిని బీసీ సోదరులు ఎండ గట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అశాస్త్రీయ కులగణన అసంబద్ధమని నిరసన గళమెత్తాలి' అని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ తెలంగాణకు చీడ, ప్రజలకు పీడ అని ఆయన అభివర్ణించారు. బీసీలకు అండగా గులాబీ జెండా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ చీటింగ్ చేసిన చోట నుంచే సర్కారుపై ఫైటింగ్ మొదలు కావాలన్నారు. కామారెడ్డిలో కొడితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోమాలోకి పోవాలి. బీసీల దెబ్బకు కాంగ్రెస్ ఏసీ కోటలు కూలాలి.

కేసీఆర్ హయాంలోనే బీసీలకు స్వర్ణయుగం. పార్టీ, ప్రభుత్వ పదవుల్లో బీసీలకు ఆయన అత్యంత ప్రాధాన్యతనిచ్చారు అని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు బీసీల పోరులో కదం తొక్కాలని, బీసీలకు జరిగిన ద్రోహంపై ప్రజల్లో చర్చ జరగాలని ఆయన కోరారు. కులగణన రీసర్వే జరిగే వరకు, బీసీలకు న్యాయమైన వాటా దక్కేంత వరకు పోరు ఆగదని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

## మావోయిస్టులతో చర్చలు జరపాలి

- దండకారణ్యంలో ఎన్కౌంటర్ లను ఆపాలి
- ఇరు దేశాల మధ్య చర్చలతో హింసకు స్వస్తిపలుకు తున్నప్పుడు తమ దేశ పౌరులతో చర్చలు చేస్తే తప్పేంటి?
- తెలుగు బిడ్డలను పిట్టల్లా కాల్చుతుంటే రెండు ప్రభుత్వాలు పట్టించుకోవా?
- మాజీ ఎం ఎల్ ఏ క్రాంతి కిరణ్



హైదరాబాద్: దండకారణ్యంలో కొన్ని నెలలుగా సాగుతున్న మారణ కాండ ఆగాలంటే చర్చలే పరిష్కారం అని సీనియర్ జర్నలిస్ట్ మాజీ ఎం ఎల్ ఏ క్రాంతి కిరణ్ అన్నారు. ఆయుధాలతో సంచరిస్తున్నారనే నెపంతో ఒక వ్యక్తి ప్రాణాలు తీసేహక్కు పోలీస్ బలగాలకు లేదన్నారు. విదేశీ శక్తులు దేశం మీద దాడికి ప్రయత్నం చేస్తే వారి జాడను కనిపెట్టి వారిపై దాడికి ప్రయోగించే డ్రోన్ లను శాటిలైట్ గన్, రోబో దేగలను మన పౌరుల మీదే ఉపయోగించడం, దారుణంగా మట్టుబెట్టడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు.

రెండు నెలల్లోనే వందల మంది ఎన్కౌంటర్‌లో చనిపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్‌గా 25 ఏళ్ళు పనిచేసిన మాజీ ఎం ఎల్ ఏ క్రాంతి కిరణ్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టింగ్ లో, నక్సల్స్ వార్తల సేకరణలో బాగా అనుభవం ఉండి గతంలో నక్సల్స్‌తో చర్చల సమయంలో కూడా క్రియాశీలకంగా పనిచేసిన అనుభవంతో మీడియాతో తన అభిప్రాయాలను పంచున్నారు.

అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి నక్సల్స్‌ని నిర్మూలించేకంటే అదే టెక్నాలజీ ఉపయోగించి దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రణాళికలు రూపొందించాలని అదే టెక్నాలజీ ఉపయోగించి దేశ సంపద దోచు కుంటున్న వారిని, ప్రజలను దోచుకుంటున్న వారిని నిర్మూలించాలని అలా చేస్తే భవిష్యత్తు లో నక్సలైట్ల ఉనికి ఉండకపోవచ్చు కదా అని ఆయన అన్నారు.

సమస్య మూలాలను పరిష్కరించే బాధ్యతను వదిలి విచక్షణా రహితంగా కాల్పులు జరిపి చనిపోయిన వారి శవాలను ఇలా కుప్పలుకుప్పలుగా పంపించడం అమానవీయమని, రాజ్యాంగ విరుద్ధమని ఆయన అన్నారు.

ఈ మారణకాండలో వేలాది మంది అమా యక ప్రజలు కూడా ప్రాణాలు కోల్పోతున్నట్టు వార్తల్లో చూస్తున్నాం అందుకే మావోయిస్టులను చర్చలకు పిలవాలని ఈ నరమేధానికి ముగింపు పలకాలని క్రాంతి కిరణ్ కోరారు.

దేశాల మధ్య ఆధిపత్య పోరులో వేలాది మంది చనియేయినప్పటికి ఇజ్రాయిల్ పాలస్తీనా దేశాలు చర్చల ద్వారా కాల్పుల విరమణ చేసి హింసకు స్వస్తిపలుకుతున్న పరిస్థితి మన కళ్లముందర కనిపిస్తున్న తరుణంలో తమ దేశ బిడ్డలతో చర్చలు జరపడానికి మన ప్రభుత్వాలు ఎందుకు ముందుకురావడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం చొరవ చూపి కాల్పుల విరమణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

## మానవత్వం చాటిన హెూం మంత్రి అనిత

- ప్రమాద బాధితురాలికి స్వయంగా సపర్యలు



నర్సరావుపేట, మహానాడు: రోడ్డు ప్రమాద బాధితురాలికి స్వయంగా సపర్యలు చేసి, హెూంమంత్రి అనిత మానవత్వం చాటుకున్నారు. హెూంమంత్రి అనిత సోమవారం రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలం వెళ్తుండగా.. నర్సరావుపేట బైపాస్ రోడ్డులోని వై జంక్షన్ వద్ద బైక్ ప్రమాదం జరిగింది. ప్రమాదాన్ని చూసిన మంత్రి వెంటనే కాన్వాయ్ ఆపి.. బాధితుల దగ్గరకు వెళ్లారు. గాయపడ్డ యువతికి స్వయంగా సపర్యలు చేశారు. హుటాహుటిన వేరే వాహనంలో ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రమాదంపై హెూంమంత్రి స్పందించిన తీరుపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

## హిందూ ధర్మం మహాసముద్రం వంటిది

- తెలంగాణలో రామ రాజ్యం పేరుతో రావణ రాజ్యం చేస్తామంటే తీవ్ర చర్యలు
- జీవిత పర్యంతం ధర్మానికే కట్టుబడి జీవించిన శ్రీ రాముని జీవన విధానానికి ఈ చర్యలు విరుద్ధం
- దుండగుల దాడిలో గాయపడి నిర్వేదంలో వున్న చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్ ను పరామర్శించిన మంత్రి కొండా సురేఖ
- రంగరాజన్‌పై దాడికి పాల్పడిన వారి పై చట్ట పరంగా తీవ్ర చర్యలకు ఆదేశం



హైదరాబాద్: హిందూ ధర్మం ఎన్నో నదులను తనలో కలుపుకునే మహాసముద్రం వంటిదని, అదే హిందూ ధర్మం గొప్పతనమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రామరాజ్యం పేరుతో తెలంగాణ రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తూ రావణ రాజ్యం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని మంత్రి స్పష్టం చేశారు.



కొందరు దుండగుల దాడిలో గాయపడి తీవ్ర విచారంలో వున్న చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్ తో పాటు వారి తండ్రి సౌందర రాజన్ ను మంత్రి సురేఖ వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి అన్నివేళలా అండగా వుంటుందని మంత్రి వారి కుటుంబానికి భరోసానిచ్చారు.

సీఎస్ రంగరాజన్‌పై జరిగిన దాడిని మంత్రి సురేఖ తీవ్రంగా ఖండించారు. సంఘవ్యతిరేక శక్తులు తమ స్వప్రయోజనాల కోసం రాముని పేరుతో రాజకీయాలు చేస్తూ, ప్రశాంతంగా సాగుతున్న తెలంగాణ సమాజాన్ని అశాంతికి గురిచేసే చర్యలను ఉక్కుపాదంతో అణచివేస్తామని తేల్చి చెప్పారు. ఎంతో ప్రాచీనమైన హిందూ ధర్మంలో ఎవరి నమ్మకాలు వారివని, తమ నమ్మకాలను ఇతరులపై రుద్దడం వారి స్వేచ్ఛను హరించడమేనని మంత్రి అన్నారు.

తన జీవిత పర్యంతం ధర్మానికే కట్టుబడి జీవించిన శ్రీరాముని పేరుతో హింసకు పాల్పడటం విచారకరమని అన్నారు. ఈ దాడికి కారకులైన వారిని చట్టబద్ధంగా శిక్షిస్తామని తేల్చి చెప్పారు. భవిష్యత్ లో ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర చర్యలుంటాయని మంత్రి సురేఖ హెచ్చరించారు.

## రేవంత్‌కు రాహుల్ అపాయింట్‌మెంట్ లేదు..

- వత్తాండు.. పోతాండు.. రేవంత్‌ను దేకేవాడేలేదు
- 11 సార్లు ఢిల్లీకి అదేపనిగా పోయినా కలవని రాహుల్
- ఏ పని కావాలన్నా 30శాతం కమిషన్
- ఇందిరాపార్కు, ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన ఆర్ఎంపీ, పీఎంపీల ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్ రావు .



హైదరాబాద్: రాష్ట్రంలో ఏ వర్గాన్ని కదిలించినా కళ్లలో కన్నీళ్లే కనిపిస్తు న్నాయి. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారు. ప్రజలు హామీలు నమ్మడం లేదని బాండ్ పేపర్ల మీద రాసిచ్చిన్రు. రాహుల్ గాంధీని తీసుకు వచ్చి హామిలిప్పించారు.

సోనియా గాంధీతో లెటర్లు రాయించారు. హామీలన్నీ ఏమయ్యాయి/

11 సార్లు ఢిల్లీ పోయినా రేవంత్ రెడ్డికి అపాయింట్ మెంట్ దొరకని పరిస్థితి. పోతున్నడు వస్తున్నడు కానీ, రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ రేవంత్ కు లేదు.

రాహుల్ గాంధీ, సోనియా గాంధీ స్పందించి ఆర్ఎంపీ, పీఎంపీలకు సహా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయించాలని డిమాండ్ చేస్తున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాడులు లేవు, కేసులు లేవు

కాంగ్రెస్ హయాంలో ఏ రాత్రి ఎవరు వస్తరో, ఎట్ల అరెస్టులు చేస్తరో తెలయని పరిస్థితి.

ఆర్ఎంపీలను పోలీసులను పెట్టి వేధిస్తున్నారు. ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్లు ఇస్తామని మేనిఫెస్టలో చెప్పారు.కేసులు పెట్టి బతుకు దెరువు లేకుండా చేస్తున్నారు. ఆర్ఎంపీలను రోడ్ల మీదకు తెచ్చారు. రేవంత్ రెడ్డి, వైద్యారోగ్య మంత్రి తక్షణం స్పందించి ఆర్ఎంపీలపై కేసులు పెట్టకుండా చూడాలని, ఎన్నికల హామీలో చెప్పినట్లు ట్రైనింగ్ ఇప్పించాలని, సర్టిఫికెట్లు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నాం.

బీఆర్ఎస్ హయాంలో మీకు శిక్షణ ఇప్పించే ప్రయత్నం చేస్తే, కొందరు స్టేలు తెచ్చారు. నేను మంత్రిగా ఉన్నప్పుడు కూడా ట్రైనింగ్ స్టార్ట్ చేసే ప్రయత్నం చేస్తే, స్టేలు తెచ్చారు. స్టేలు తెచ్చినా మేం మీ బతుకు దెరువు ఎక్కడా ఆపలేదు. మీ మీద కేసులు పెట్టలేదు. పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పలేదు. కాంగ్రెస్ వాళ్లు వచ్చినంక అందరి బతుకులు రోడ్డున పడ్డయి. గీత కార్మికుల పొట్ట కొడుతున్నరు. అక్రమ కేసులు పెడుతున్నరు

రైతులు, నేత కార్మికులు, ఆటో డ్రైవర్లు, చివరకు బిల్డర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నరు.

మొదటి హామి మహాలక్ష్మి, చివరి హామీ పింఛన్లు దిక్కు లేదు. రైతు రుణ మాఫీ మీద ఏ ఊర్లకైనా పోదాం చర్చిద్దాం. ఇవ్వాల్సింది 45వేల కోట్లు, ఇస్తానన్నది 31, ఇచ్చినా అని చెబుతున్నది 21, ఇచ్చింది 15, 16వేల కోట్లు. రుణమాఫీ ఓ మోసం. ఆ 15,16 వేల కోట్లు ఎట్ల ఇచ్చిండంటే.. వానాకాలం రైతు బంధు ఎగ్గొట్టి 8వేల కోట్లు, రుణమాఫీకి ఇచ్చిండు. రెండు నెలల పింఛన్ 2వేల కోట్లు ఎగ్గొట్టి, రుణమాఫీకి ఇచ్చిండు.

కేసీఆర్ ఇచ్చే బతుకమ్మ, రంజాన్, క్రిస్టమస్ చీరెలు వెయ్యి కోట్లు ఎగ్గొట్టి, రుణమాఫీకి మలిపిండు. కేసీఆర్ ఇచ్చే న్యూట్రీషన్ కిట్లు, కేసీఆర్ కిట్లు బంద్ పెట్టిండు. అందులో రెండు వేల కోట్లు. పిల్లల ఫీజు రియింబర్స్ మెంట్ కూడా ఎగ్గొట్టిండు. 2500 కోట్లు రుణమాఫీల కలిపిండు. ఇట్ల కోతలు కోసిండు రుణమాఫీలో కలిపిండు.

ఇచ్చింది ఏముంది. చేసిన హామీలు ఏమయ్యాయి? ప్రజలు ఎవరు వచ్చినా ప్రతి రోజు సీఎం కలుస్తడు అంటడు. 15 నెలలు అయినా ఎవర్నీ కల్వలేదు. కొడంగల్ వాళ్లను కూడా రానివ్వని పరిస్థితి. మీ సత్తా చూపే సమయం వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. కలసి ఉండాలి. విడిపోయి ఉండొద్దు. అప్పుడే మీకు బలం ఉంటది

కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు కంకణం కట్టుకోవాలి. రేవంత్ రెడ్డి గాల్లో ఉన్నడు. గాలి మోటర్లు, విమానాల్లో తిరుగుతున్నడు ప్రజాస్వామ్యంలో ఓటే బలం. వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల గురించి, ప్రశ్నిస్తా నిలదీస్తా

ఇప్పటికే అరెస్టు చేసిన వారి మీద వెంటనే విడుదల చేయాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఏ జిల్లాలో ఎక్కడ ఇబ్బంది వచ్చినా మీకు బీఆర్ఎస్ జెండా అండగా ఉంటది

ఓట్లప్పుడు మాటలు చెప్పిండు. అధికారంలోకి వచ్చాక మాట మార్చుతున్నడు. అడిగితే ఉల్టా కేసులు పెట్టి జైల్లో వేస్తున్నడు పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్లు తప్ప. 30 పర్సెంట్ గవర్నమెంట్ అని ఎమ్మెల్యేలే చెబుతున్నరు. ఏ పని కావాలన్నా 30శాతం కమిషన్

పోలీసు వాళ్లకు జీతాలు రావడం లేదు, ఆరోగ్య భద్రత పని చేస్తలేదు

పోలీసులు, ఆటో డ్రైవర్లు అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఇబ్బంది పెడుతున్నది

ఉద్యోగస్థులకు డీఏలు పెండింగ్, రిటైర్మెంట్ అయిన వారికి బెన్ఫిట్స్ ఇవ్వడం లేదు. మాటల గారడీ, అంకెల గారడీ అని అందరికి అర్థం అయ్యింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు బుద్ధి చెబుదామని చూస్తున్నరు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి పొయ్యి ప్రచారం చేసిండు. 80 స్థానాల్లో 77కి డిపాజిట్లు గల్లంతు.

ఇక్కడ పని చేసి వేరే రాష్ట్రాల్లో వెళ్లి ప్రచారం చేసుకో. తెలంగాణలో ఏ ఊళ్లకు పోయినా నీ పాలన గురించి చెబుతారు రేవంత్ రెడ్డి. కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీలో ఉపన్యాసాలు దంచడం కాదు, గల్లీకి పోదాం రా రేవంత్ రెడ్డి. వడ్ల బోనస్ పైసలు ఇప్పటికీ వేయలేదు. 440 కోట్లు పెండింగ్ ఉన్నయి. మన నెత్తి కొట్టి మనకు పెట్టడం తప్ప రేవంత్ రెడ్డి కొత్తగ చేసిందేం లేదు. ఒకే ఏడాదిలో లక్షా 47వేల కోట్ల అప్పు చేసిండు. ఒక ప్రాజెక్టు కట్టింది లేదు, ఓ కాళేశ్వరం కట్టింది లేదు, చెరువు చెక్ డ్యాం నిర్మించింది లేదు.

10 ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం 4కోట్ల 17లక్షలు చేస్తే, రేవంత్ ఒకే ఏడాదిలో లక్షా 47వేల కోట్లు చేసిండు..

ఒక్క రూపాయి వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదు. మహిళలను కోటీశ్వరులను చేస్తా అన్నడు. పైసా ఇవ్వలేదు. ధైర్యం కోల్పోకండి. కష్టం వస్తే పోరాడాలి. సమస్యను పరిష్కారం చేసుకోవాలి. ఆర్ఎంపీ, పీఎంపీలకు 20ఏండ్ల క్రితం ప్రభుత్వ జాగాలో, ప్రభుత్వ పైసలతో భవనాలు కట్టించి, మీ ఆత్మగౌరవం కాపాడినం. అసెంబ్లీలో నేను, బయట మీరు పోరాటం చేయండి.

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు సురుకు పెట్టాలె. ఓట్ల రూపంలో కర్రు కాల్చి వాత పెట్టాలె. ప్రజలు ఎంత కోపంగా ఉన్నరో తెల్వాలంటే జిల్లా పరిషత్ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలి

వైద్యారోగ్య మంత్రి వద్దకు తీసుకువెళ్లి మీ సమస్యలకు పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తాం.

## కేటీఆర్‌కు ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

- కేకేని కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకుంటాం
- కేటీఆర్‌కు దమ్ముంటే కొడంగల్‌లో ఒక జడ్పీటీసీ లేదా ఎంపీపీ గెలవాలి
- రాజీనామాకు రేవంత్ రెడ్డి అవసరం లేదు.. నేను సిద్ధం
- కేటీఆర్ అబద్ధాల పుట్ట
- పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి



హైదరాబాద్: గతంలో నేను కేటీఆర్, హరీష్ రావుకు అసెంబ్లీలోనే రాజీనామా సవాల్ విసిరాను. రాజీనామాపైన కేటీఆర్, హరీష్ రావు ఇప్పటివరకు స్పందించలేదు. కేటీఆర్‌కు దమ్ము, ధైర్యం ఉంటే సిరిసిల్ల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. కేకే మహేందర్ రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకుంటాం. ఆరిపోయే దీపంలా కేటీఆర్ మాట్లాడుతున్నారు. జైలుకు పోతామన్న భయంతోనే ఊక దంపుడు ఉపన్యాసాలు చేస్తున్నాడు. హైదరాబాద్ నుంచి మనుషులను తీసుకెళ్లి దారి పొడువునా కేటీఆర్ షో చేస్తున్నాడు. పగటి వేషగాడి లా కేటీఆర్ మాటలున్నాయి.

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ నాడు కొడంగల్ ను పట్టించుకోలేదు. లక్ష రూపాయల రుణమాఫీ కూడా సరిగా చేయకుండా రైతులను దగా చేశారు. కొడంగల్ యువతకు ఉపాధి కల్పించడం కోసం పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తుంటే బీఆర్ఎస్ దుష్ప్రచారం చేసింది. కలెక్టర్ ను చంపించడానికి సురేష్ అనే వ్యక్తితో ప్రయత్నం చేయించారు.

పారిశ్రామిక వాడ కోసం భూములు ఇవ్వడానికి రైతులు స్వచ్ఛందంగా లేఖలు ఇస్తున్నారు. భూములు ఇచ్చిన రైతులకు ఎకరానికి 20 లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తున్నాం. అసైన్డ్ భూములకు కూడా ఎకరానికి 20 లక్షల రూపాయల పరిహారం ఇస్తున్నాం.ప్రతి రైతు కు అభివృద్ధి చేసిన 150 గజాల ప్లాట్ ఇస్తున్నాం.. దీని వల్ల 15 లక్షలు భూములు ఇస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాం.. కుటుంబానికో ఉద్యోగం ఇస్తున్నాం.


కొడంగల్‌కు ఇప్పటికే మెడికల్ కాలేజ్ మంజూరు అయింది.. ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేశాం. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ను ఏర్పాటు చేశాం. కొడంగల్ అభివృద్ధి కోసం 6,128 కోట్ల రూపాయలను కేటాయించాం. కొడంగల్ లో మా రేవంత్ రెడ్డిని ఓడించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో అనేక శిలాఫలకాలు వేసి వదిలేసింది.

బీఆర్ఎస్ హయాంలో మా జిల్లాలో ఒక డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదు.. ఒక రేషన్ కార్డు ఇవ్వలేదు. 45 వేల కోట్లతో ఒకే రోజు నాలుగు పథకాలను మా ప్రభుత్వం తీసుకువచ్చింది. కేటీఆర్ ఎప్పుడు జైలుకు పోతాడో తెలియదు.. కేటీఆర్ చెల్లెలు ఇప్పటికే తీహార్ జైలుకు పోయి వచ్చింది. కేటీఆర్ పైన ఏసీబీ, ఈడీ విచారణ జరుగుతోంది. కేటీఆర్ అబద్ధాల పుట్ట. మా సీఎం రేవంత్ రెడ్డి పైన మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్ కు లేదు. నా నియోజకవర్గంలో రుణమాఫీ పైన నేను ఛాలెంజ్ చేస్తే కేటీఆర్ నోరు మెదపలేదు..

## రామరాజ్యం పేరుతో రంగరాజన్‌పై దాడి

- భారీ పరిశ్రమలు, ఐటి మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, మహానాడు: రామ రాజ్యం పేరుతో దాడులు చేసే వారిని ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది రామరాజ్యం పేరుతో చిలుకూరి బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకులు మరియు నిర్వాహకులు అయిన రంగరాజన్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా ఇది హేయమైన చర్య, రామరాజ్యం పేరుతో రౌడీయిజం చేస్తూ అరాచకాలకు పాల్పడు



తున్న వారిని ఉపేక్షించేది లేదు.. రాముడి పేరును బద్నామ్ చేస్తూ అరాచక అనాగరిక కార్యక్రమాలకు పాలపడడం దుర్మార్గం వారు చేసే ఆగడాలకు రాముడి పేరును వాడుకుంటు రామరాజ్యం అని చెప్పడం క్షమించని నేరం అంతే కాదు రాముడి భక్తుల మనోభావాలను దెబ్బ తీసే చర్య కొందరు ప్రజలలో ఉన్న హిందుత్వ భావాన్ని ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్నారు ఇలాంటి వారి పట్ల పోలీసులు ప్రజలు రాజకీయ పార్టీలు అందరూ అప్రమతంగా ఉండాలి. ఇలాంటి దుర్మార్గపు చర్యలు, అరాచక శక్తుల పట్ల ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుంది.

ధర్మాన్ని కాపాడుతూ సమాజ హితం కోసం నిస్వార్థంగా పని చేస్తున్న అర్చకుల పట్ల ఇలాంటి దాడులు అమానుషం. ప్రభుత్వం ఇలాంటి దాడులను ఉపేక్షించదు.. కఠినంగా వ్యవహరిస్తాం..



## ఎర్ర కాల్వ సమస్య పరిష్కరించాలి

- కేంద్ర మంత్రికి విన్నవించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి

విజయవాడ: తూర్పు గోదావరి జిల్లా లో రైతుల దుఃఖ దాయనిగా ఉన్న ఎర్ర కాలువ సమస్య తీర్చేందుకు నిధులు విడుదల చేయాలనీ కేంద్ర నీటి పారుదల శాఖ మంత్రి పాటిల్ ని కలిసి వినతి పత్రం అందించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి..ఎన్నో సంవత్సరాల నుంచి ఎర్రకాలువ నుంచి రైతులు ఎదురుకుంటున్న సమస్యల పై కేంద్ర మంత్రి పాటిల్ కి వివరించారు రైతులకు శాశ్వత పరిస్కారం కోసం 268 కోట్ల రూపాయల వరకు ఖర్చు అవుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
5
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, ఫిబ్రవరి 2025

# త్వరితగతిన ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయండి

◆ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్‌ను కలిసిన ఎంపీ వేమిరెడ్డి



న్యూఢిల్లీ: నెల్లూరులో 100 పడకల ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసేలా త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు.

సోమవారం ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా హాస్పిటల్ ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. స్థల పరిశీలనకు సంబంధించి అంశాలపై మాట్లాడారు. త్వరితగతిన నిర్ణయం తీసుకుని హాస్పిటల్ ఏర్పాటు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## రావులపాలెంలో పేరాబత్తుల రాజశేఖర్‌కు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, మహానాడు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్డీయే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడానికి ఏలూరు వెళ్తున్న పేరాబత్తుల రాజశేఖర్ కు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ గణేష్ కుమార్, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, వాసిరెడ్డి రాంబాబు సోమవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీ సంఖ్యలో వాహనాలతో ర్యాలీగా కొత్తపేట నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో



ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణ రెడ్డి, కరుటూరి నరసింహారావు, పాలూరి సత్యానందం, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, కేతా శ్రీను, కంఠంశెట్టి శ్రీనివాస్, బండారు బాబీ, తోట స్వామి, అంబటి కిషోర్, అయినవిల్లి సత్తిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ సోమవారం ఏలూరు కలెక్టరేట్లో నామినేషన్ దాఖలు చేస్తున్న నేపథ్యంలో ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యం లో ఉంగుటూరు నియోజకవర్గం గుండుగొలను నుండి భారీ ర్యాలీగా బయలు దేరిన ఉంగుటూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ శ్రేణులు.

## మడకశిర ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

◆ ఎమ్మెల్యే రాజు

మడకశిర, మహానాడు: మడకశిర నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ప్రధాన ధ్యేయంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి




స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు ఎం.ఎస్.రాజు పనిచేస్తున్నారు. దీనిలో భాగంగానే మడకశిర ఎమ్మార్వో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. కలెక్టర్ టి.ఎస్.చేతన్, అధికార యంత్రాంగం హాజరైంది. ఎమ్మెల్యే, తిప్పేస్వామి ప్రజల నుండి వచ్చిన వినతులను పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి ప్రజలు పెద్దఎత్తున వచ్చి, తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. కొన్ని సమస్యలను తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే పరిష్కారించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారులకు అప్పగించి, వాటి పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించి, తమ సమస్యలకు పరిష్కారం చూపడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## కిలాడి లేడీ అరెస్ట్

తిరుపతి, మహానాడు:

జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌పై ఆరోపణలు చేసిన కిలాడి లేడీ లక్ష్మిని రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేశారు. పలు రాష్ట్రాల్లో ఆమెపై చీటింగ్, బ్లాక్మెయిల్ కేసులు ఉన్నాయని, ఈమె కొన్ని నెలలుగా తప్పించుకుని తిరుగుతోందని పోలీసులు తెలిపారు. ఆమెను, టీవీలలో కనిపించిన వెంటనే గుర్తించినట్టు తెలిపారు. నిందితురాలిని చైన్నై తరలించారు.










# 'పెద్దిరెడ్డి' అరాచకాలతో భయం... భయం!

◆ ఆయన కుటుంబ సభ్యులకే ఇంకా తొత్తులుగా ఉన్న అధికారులు

◆ గ్రీవెన్స్‌లో బాధితుల మొర

◆ అర్జీలు స్వీకరించిన నేతలు

మంగళగిరి, మహానాడు: చిత్తూరు జిల్లా, సదుం మండలానికి చెందిన జి.సుబ్బరాజు, ఎల్లప్ప తదితరులు సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు ఫిర్యాదు చేశారు. తమపై పెద్దిరెడ్డి, వారి అనుచరులు అక్రమ కేసులు పెట్టి హింసించడమే కాకుండా.. నాడు ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎలక్షన్ ఏజెంట్లుగా పని చేయకుండా తమను కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. ఈ ఘటనపై నాడు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. అలాగే నేటికి స్థానిక పోలీసులు, అధికారులు



పెద్దిరెడ్డి కుటుంబానికి తొత్తులుగా పనిచేస్తున్నారని.. కేసులు పెట్టినా పట్టించుకోవడంలేదని మొరపెట్టుకున్నారు. టీడీపీ కార్యకర్తల సమస్యలంటేనే పక్కన పెడుతున్నారని, దీనిపై విచారించి ఆ అధికారులపై చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని వారు మాజీ రాజ్యసభ సభ్యుడు కంభంపాటి రామ్మోహన్ రావు, ఎమ్మెల్సీ అశోక్ బాబు, బ్రాహ్మణసాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ లకు అర్జీ ఇచ్చారు.

◆ గత 30 ఏళ్ళుగా టీడీపీ కార్యకర్తలుగా ఉన్న తమను వైసీపీ నాయకులు తమ మాట వినలేదని.. తమ జీవనాధారమైన భూమిని కబ్జా చేసి రికార్డులు మార్చి షేక్ ఖాతిజాభి పేరున మార్చారని దీనిపై అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని కడప జిల్లా గోపవరం మండలానికి చెందిన వైకుంఠం రామకేశయ్య వేడుకున్నారు.

◆ ఎన్టీఆర్ జిల్లా, విజయవాడకు చెందిన బల్లంకి సత్యనారాయణ గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేస్తూ.. తనకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటిని వల్లంకి రాజారావు వారి కుటుంబ సభ్యులు ఆక్రమించుకొన్నారని.. వారి కబ్జానుండి తన ఇంటిని విడిపించాలని నేతలకు అర్జీ ఇచ్చి వేడుకున్నాడు.

◆ తెనాలి పట్టణ వైసీపీ కౌన్సిలర్ పారం సంజీవరెడ్డి క్రికెట్ బెట్టింగ్, దొంగ లాటరీ వ్యాపారంతో సమాజాన్ని చెడగొడు



తున్నారని అతనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని తెనాలికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు.

◆ గుంటూరు జిల్లా, తెనాలి మండలం గుడివాడ గ్రామానికి చెందిన గరికపాటి లింగారావు విజ్ఞప్తి చేస్తూ.. కోర్టులో ఉన్న భూమికి రూ. 10 లక్షలు లంచం తీసుకొని మ్యూటేషన్ చేసిన ఎమ్మార్వో గోపాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని గరికపాటి లింగారావు అనే వ్యక్తి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

◆ అల్లూరి జిల్లా, యటపాక మండలం గౌరీదేవి పేటకు చెందిన రంగేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. గ్రామ పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరాడు. అలాగే శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూల్చి కొత్తది నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

◆ తాము కొనుగోలు చేసి రిజిస్ట్రర్ చేయించుకున్న భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని దాన్ని తొలగించాలని ఎన్నిసార్లు అధికారులకు అర్జీలు పెట్టుకున్న పట్టించుకోవడంలేదని దయ చేసి తమ భూసమ్యను పరిష్కరించాలని కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామానికి చెందిన కాశి. విజయలక్ష్మి నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

◆ ఏలూరు జిల్లా, చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం గ్రామానికి చెందిన పండు తిరుపతి దాసు విజ్ఞప్తి చేస్తూ.. తనకు వారసత్వంగా వచ్చిన భూమిని తన అన్న అక్ర మంగా మొత్తం ఒక్కడే తన పేరుమీద ఎక్కించుకున్నాడని.. దయ చేసి దీనిపై అధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

◆ అన్నమయ్య జిల్లా, మొలకల చెరువు మండలం నాయుని చెరువు పల్లె గ్రామాని చెందిన గుండాల శ్రీనివాసులు విజ్ఞప్తి చేస్తూ.. తమ భూమిని మరోకరిపేరుపై తప్పుగా ఆన్ లైన్ చేశారని.. దాన్ని సరి చేసి తమ భూమి తమకు ఆన్ లైన్ అయ్యేలా చూడాలని కోరాడు.

◆ శ్రీ సత్యసాయి జిల్లా, నల్లచెరువు మండలం తలమర్ల వాండ్లపల్లి గ్రామానికి చెందిన జి. విజయ్ కుమార్ విజ్ఞప్తి చేస్తూ.. తాము గత 20 ఏళ్ళ నుండి సీపీడబ్ల్యుఎస్ స్కీమ్ లో పనిచేస్తున్నామని... 2019 వరకు తమకు జీతాలు సక్రమంగా అందాయని. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో తమకు రావాల్సిన జీతాలను శ్రీ లక్ష్మీ నరసింహ మోటార్ ఇండస్ట్రీ వారు ఇవ్వలేదని.. వారు బిల్లులు చేసుకుని తమకు జీతాలు ఎగ్గొట్టారని.. దీనిపై



తమకు న్యాయం చేయాలని నేతలను వేడుకున్నాడు.


◆ తాను టీడీపీకి సానుకూల పరుడిగా ఉండటంతో గత ప్రభుత్వం తనకు వస్తున్న పింఛన్ ను అకారణంగా తొలగించారని తనకు తొలగించిన పింఛన్ ను పునరుద్ధరించి న్యాయం చేయాలని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన రామయ్య విజ్ఞప్తి చేశాడు.

◆ ఎన్టీఆర్ జిల్లా, విజయవాడకు చెందిన గొర్ల శిరీష విజ్ఞప్తి చేస్తూ.. తనను కులాంతర వివాహం చేసుకున్న తన భర్త మోడెం స్వామికొండ పెళ్లి అనంతరం విడాకుల కోసం చిత్ర హింసలు పెట్టాడని.. తన వద్ద ఉన్న బంగారం డబ్బులు తీసుకొని తనకు తెలియకుండా మరొక పెళ్లి చేసుకున్నాడని.. అతనిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆమె గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేసింది.

# ఆంధ్రా మాఫియా 'పెద్దిరెడ్డి' ఫ్యామిలీ!

◆ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపణ

మంగళగిరి, మహానాడు: పెద్దిరెడ్డి కుటుంబం రాష్ట్రంలో ఒక మాఫియాలా తయారై.. ఒక ఆటవిక సామ్రాజ్యాన్ని నిర్మించుకుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విలేఖరుల సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడారు. గతంలో తన అక్రమ సంపాదనతో జగన్ ను పడగొట్టి తాను ముఖ్యమంత్రి కావాలని కూడా పెద్దిరెడ్డి అనేక సార్లు ప్రయత్నించారు. పెద్దిరెడ్డి కుటుంబం అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకొని... గనులు, ఖనిజం, ఇసుక, ప్రభుత్వ స్థలాలు, పేదల, అటవీ భూములు, ఎర్రచందనం, యథేచ్ఛగా దోచుకున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే సామ, దాన, భేద, దండోపాయాలు ఉపయోగించి నోరు మూయించేవారు. అధికారులు కూడా వీరి చేష్టలు చూసీ చూడనట్లు ఉండాల్సిందే.. ఎదురుతిరిగితే తిప్పలు తప్పవు.



పెద్దిరెడ్డి 238 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించాడంటే.. అటవీ చట్టం ఇతనికి ఎన్ని జీవిత శిక్షలు వేయొచ్చో చెప్పాలి. బీహార్ రాజకీయం కూడా పెద్దిరెడ్డి రాజకీయం ముందు దిగదుడుపే. గనుల శాఖలో 400 మందికి ప్రైవేటుగా ఉద్యోగాలిచ్చాడంటే ఈ పెద్దిరెడ్డి ఎంతటి ఘనాపాటో అర్థం చేసుకోవచ్చు. పెద్దిరెడ్డి ప్రెస్‌లో తాను తప్పు చేయలేదని ఎప్పుడు చెప్పలేదు గానీ... నన్నెవరూ ఏమీ చేయలేరని మాత్రం పదే పదే చెప్పేవాడు. పెద్దిరెడ్డి పాపాల్లో జగన్ కు భాగముండబట్టే ఇతని అవినీతి సామ్రాజ్యాన్ని జగన్ ఏనాడూ ప్రశ్నించలేదు.

చంద్రబాబు పుంగనూరు వెళ్తానంటే.. నా పుంగనూరులో అడుగుపెట్టడానికి వీల్లేదని నిరోధించిన అరాచకవాది ఈ పెద్దిరెడ్డి. గనులేమో పెద్దిరెడ్డి, అటవీశాఖ పెద్దిరెడ్డి శ్రీమతికి, మద్యం అవినాష్ రెడ్డికి, ఎర్రచందనం పెద్దిరెడ్డి తమ్ముడు ద్వారకనాథరెడ్డికి ఇలా పంచుకుని రాష్ట్రాన్ని కొల్లగొట్టారు. అనేక ఎకరాల అటవీ భూములను కొల్లగొడుతుంటే అటవీశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించారు. ఏ చర్యలు తీసుకోలేదు. అటవీశాఖ అధికారులు మీన మేషాలు లెక్కిస్తూ కూర్చున్నారు. ఇప్పుడైనా రంగంలోకి దిగాలి. విజిలెన్స్ రిపోర్టును బేస్ చేసుకొని రంగంలోకి దిగాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేం డిమాండ్ చేస్తున్నాం.

రాక్షస సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న పెద్దిరెడ్డిపై వెంటనే ఫారెస్టు యాక్టు కింద కేసు రిజిష్టర్ చేయాలి. పెద్దిరెడ్డి కుంటుంబం విదేశాలకు పారిపోయే అవకాశముంది. కావున ఆ నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి వారి పాస్ పోర్టులు స్వాధీనం చేసుకోవాలి. ఫారెస్టు యాక్టుల నుంచి తప్పించుకోవడం అంత సులభం కాదు. నాన్ బెయిలబుల్ యాక్టులున్నాయి. వీరిపై ఆ సెక్షన్లు పెట్టాలి. పెద్దిరెడ్డి వెయ్యి తప్పులు పూర్తయ్యాయి... కావున దండన తప్పదు. పెద్దిరెడ్డిపైన ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరికి ఈ ప్రభుత్వం న్యాయం చేస్తుంది. పెద్దిరెడ్డి పనైపోయింది, ఇక కోరలు పీకిన పాములాంటివాడు.

పుంగనూరు ప్రాంతంలోని రెవెన్యూ, పోలీసు, ఫారెస్టు శాఖల అధికారులు పెద్దిరెడ్డి తప్పులను వెలికితీయడంలో నిమగ్నమవ్వాలి. వారిని అరెస్టు చేసి జ్యుడిషియల్ ఎంక్వైరీకి పంపాలి. ఇక్కడ ప్రెస్ లో మాట్లాడుతుంటే, పెద్దిరెడ్డి మీద ఫిర్యాదు ఇవ్వడానికి పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ ముందు పెద్దిరెడ్డి బాధితులు క్యూ కట్టారు. పెద్దిరెడ్డి కుటుంబ అవినీతిపై వెంటనే ఈడి, ఐటీ శాఖాధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టాలి. పెద్దిరెడ్డి కుటుంబం తమ విలాసాలకు కట్టుకున్న భవంతులపై కూడా విచారణ జరపాలి. తప్పకుండా ఇన్వెస్టిగేషన్ చేయాల్సిందిగా ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేస్తున్నానని రామయ్య అన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబం అసాంఘిక కార్యకలాపాల్లో ఆరితేరిన కుటుంబంగా పేరు తెచ్చుకుంది. గతంలో వీరి చేష్టలు అధికారులను కూడా ఇబ్బంది పెట్టేవి. పదేళ్ల క్రితం స్కూటర్ పై తిరిగేవాడని సత్తెవీడు ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పాడు. ఆర్థికంగా ఇంత ఎత్తుకు ఎలా ఎదగగలిగారో ప్రజలకు తెలియజేయాలి. అటవీ భూములను గొల్లగొట్టి ఆటవిక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న వీరికి శిక్ష పడాలి. విజిలెన్స్ రిపోర్టు పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా రావడం అందరికీ తెలిసిందే.

ముఖ్యమంత్రి కలుగజేసుకొని పెద్దిరెడ్డి పాపాలపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను. పెద్దిరెడ్డి విజిలెన్స్ కి దొరికిపోయాడు. చట్టం ఇతనిపై ఇనుప పాదం మోపబోతోంది. అందుకే భయం విడిచి పార్టీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో ఫిర్యాదుదారులు వస్తున్నారు. పెద్దిరెడ్డి అవినీతిపై లిస్ట్ అవుట్ చేస్తున్నారు. పెద్దిరెడ్డి "మా భూములు కొట్టేశారు, మా ఆస్తులు కొట్టేశార"ని ఫిర్యాదులు గ్రీవెన్ సెల్‌లో కో కొల్లలుగా వస్తున్నాయి. ఇలాంటి వారు సభ్య సమాజంలో నివసించడానికి వీలులేదు. సంబంధిత పోలీసు స్టేషన్ లకు ప్రభుత్వం ద్వారా పెద్దిరెడ్డి పాపాల చిట్టా పోతుంది. వారిపై కేసులు రిజిష్టర్ చేసి బాధితులకు న్యాయం జరుగుతుందని పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తెలిపారు.

# అన్నదాత అభ్యున్నతే చంద్రబాబు ధ్యేయం

◆ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

కొత్తచెరువు, మహానాడు: అన్నదాత అభ్యున్నతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ధ్యేయమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు మండల కేంద్రంలో రైతులకు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు పంపిణీ కార్యక్రమం తో పాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం ప్రారంభోత్సవానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో పాటు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొత్తచెరువులో సోమవారం రైతులకు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభించారు. నేడు 40 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను రైతులకు అందించామని, ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకోవడానికి ఇదే నిదర్శనం అన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది అనేది ముఖ్యమంత్రి గొప్ప ఆలోచన అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు ముఖపట్నం పుట్టపర్తి రూరల్ మండలాలకు



సుమారు 40 విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు మంజూరయ్యాయని, వీటి విలువ సుమారు 1. 72 కోట్లు అని తెలిపారు. ఈ వ్యయాన్ని ప్రభుత్వమే భరించి రైతుల నుంచి సర్వీస్ కు రూ. 10,600 లు మాత్రమే వసూలు చేస్తోందని గుర్తు చేశారు. అదేవిధంగా విద్యుత్ ఏఈ కార్యాలయం 23 లక్షలతో భవనాన్ని నిర్మించామని అన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని తెలిపారు.

వైసీపీ పాలనలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ సాగుకు పెట్టుబడులు పెట్టలేక వెనుకడుగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ పెట్టుబడి తో లాభసాటి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క రైతుకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులు అందజేస్తామని తెలిపారు. ట్రాన్స్ ఫార్మర్లు కోసం రైతులు ఎవరికీ సొమ్ములు ఇవ్వొద్దన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఈ శివరాముడు, ఏఈ లు వెంకటేష్ నాయక్, చంద్ర నాయక్, శ్రీనివాసులు ,టీడీపీ మండల నాయకులు కన్వీనర్లు వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ మల్లిరెడ్డి, విజయ్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు సామకోటి ఆది నారాయణ, బంగారు కృష్ణమూర్తి, వల్లపు సోమశేఖర్, బైరాపురం సర్పంచ్ రవి, కేశాపురం లక్ష్మీనారాయణ రెడ్డి మరవ కుంటపల్లి మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, కొత్త చెరువులో గ్రంథాలయ ఉద్యోగుల సంఘం 2025 క్యాలండర్ ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు ఆవిష్కరించారు.

జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ మంగళవారం 11, ఫిబ్రవరి 2025 ‖

# పశ్చిమ బైపాస్‌కు రంగా పేరు పెట్టండి : సీఎంకు షర్మిల లేఖ



**విజయవాడ, మహానాడు:** గుంటూరు జిల్లా కాజా టోల్ గేట్ నుంచి గన్నవరం దగ్గరలోని చిన్న అవుటుపల్లి వరకు 47.8 కిలోమీటర్ల దూరం గల విజయవాడ పశ్చిమ జాతీయ బైపాస్ రహదారి పూర్తి కావొచ్చినందుకు సంతోషం... ఈ ఆరు వరుసల రహదారి ద్వారా విజయవాడ వాసుల ట్రాఫిక్ కష్టాలు కొంతమేర గట్టెక్కుతాయని ఏపీసీసీ చీఫ్ షర్మిల ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆమె.. ఈ బైపాస్ రహదారికి విజయవాడ తూర్పు మాజీ శాసన సభ్యుడు దివంగత వంగవీటి మోహన రంగా పేరు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడికి లేఖ రాశారు. రంగా ప్రజలకు చేసిన సేవ అనిర్వచనీయం. సామాజిక న్యాయంపై దృష్టి సారించి.. అణగారిన వర్గాల సంక్షేమం కోసం వాదించి.. భూమి లేని వారికి భూ పంపిణీ చేసి.. ప్రజల గుండెల్లో చిరస్మరణీయమైన ముద్ర వేసుకున్నారన్నారు. మహోన్నత వ్యక్తి వంగవీటి మోహన రంగా. ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ విజయవాడ పశ్చిమ బైపాస్ జాతీయ రహదారికి "వంగవీటి మోహన రంగా బైపాస్ జాతీయ రహదారి"గా పేరు పెట్టాలని..ఆ ప్రతిపాదనలు కేంద్రానికి పంపాలని కోరుతున్నామన్నారు.



## అన్నక్యాంటీన్‌కు రూ.6 లక్షల విరాళం

◆ సీఎంను కలిసి చెక్కు అందించిన రిటైర్డ్ పవర్ ఇంజనీర్స్ అసోసియేష్ ప్రతినిధులు

**అమరావతి, మహానాడు:** అన్నక్యాంటీన్‌కు ది రిటైర్డ్ పవర్ ఇంజనీర్స్ అసోసియేష్ ప్రతినిధులు విరాళం ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబును సచివాలయంలో కలిసి రూ.6,66,666ల చెక్కును అందించారు. పేదవాడు పస్తులుండకూడదన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌లకు విరాళాలు ఇచ్చి దాతృత్వం చాటుకున్న అసోసియేషన్ ప్రతినిధులను సీఎం అభినందించారు. చెక్కు అందించిన వారిలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ జి.పట్టాభిరామారావు, వై.కుమారస్వామి, సెక్రటరీ సాంబశివరావు, ట్రెజరర్ ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు, సభ్యులు డీ.టీ నాయుడు, మల్లికార్జున రావు ఉన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే కన్నా పరామర్శ


**ముప్పాళ్ళ, మహానాడు:** ముప్పాళ్ల మండలం చాగంటి వారి పాలెంకు చెందిన మధిర గంగమ్మ, మధిర సామ్రాజ్యం, తేనేపల్లి పద్మావతి, చక్కెర మాధవి వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. గత రోజు పొలం పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో మిర్చి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్




అదుపుతప్పి మాదల కెనాల్‌లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల పార్థివదేహాల వద్ద పూలమాల ఉంచి, ఘన నివాళులర్పించారు. బాధితులకు ప్రభుత్వ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## అమ్మడు కాఫీ హోటల్‌కు సాహితీ పురస్కారం

**శ్రీకాకుళం, మహానాడు:** ప్రముఖ కథా రచయిత భమిడిపాటి గౌరీశంకర్ రచించిన కథల సంపుటి 'అమ్మడు కాఫీ హోటల్‌కు కడప జిల్లా



ప్రొద్దుటూరుకు చెందిన కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహితీ కళా వేదిక గౌరవ సాహితీ పురస్కారం లభించింది. ఈ మేరకు రచయిత సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పురస్కారం కింద పది వేల రూపాయలు నగదు, జ్ఞాపికతో ఘన సత్కారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమం మార్చి పది తరువాత జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురజాడ విద్యా సంస్థల అధినేత జీవీ స్వామి నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కేవీవీ సత్యన్నారాయణ, ఐక్యూ ఏసీ డాక్టర్ మార్తండ కృష్ణ, తదితర అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## అట్టహాసం ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం నామినేషన్

◆ భారీ ర్యాలీగా తరలి వెళ్ళిన ఎమ్మెల్యే వేగుళ్ళ, పార్టీ ప్రముఖులు

**కాకినాడ, మహానాడు:**
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 27న జరగనున్న తరుణంలో సోమవారం కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ వేసేందుకు కాకినాడ నుండి భారీ ర్యాలీ నడుమ మండపేట మీదిగా ఏలూరు బయలుదేరి వెళ్ళారు. ఈ ర్యాలీలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర అంచనాల కమిటీ



చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజశేఖరం అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని ఆకాంక్షించారు.

## అర్చకుడిపై దాడి.. ధర్మ పరిరక్షణపై దాడిగా భావించాలి

◆ పవన్ కల్యాణ్



**అమరావతి, మహానాడు:** చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై దాడి దురదృష్టకరం... ఇది ఒక వ్యక్తిపై కాదు... ధర్మ పరిరక్షణపై దాడిగా భావించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. చిలుకూరులోని ప్రసిద్ధ బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై ఒక మూకదాడి చేసిందని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాను. దురదృష్టకరమైన ఘటన ఇది. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ దాడిని ఒక వ్యక్తిపై చేసినట్టుగా కాకుండా–ధర్మ పరిరక్షణపై చోటు చేసుకున్న దాడిగా భావించాలి. కొన్ని దశాబ్దాలుగా రంగరాజన్ ధర్మ పరిరక్షణకు, ఆలయాల వార సత్వ సంప్రదాయాలు, పవిత్రతను కాపాడేందుకు తపిస్తున్నారు. పోరాటం చేస్తున్నారు.

రామరాజ్యం అనే సంస్థ సభ్యులమని చెప్పి వెళ్ళిన ఒక మూక ఈ దాడి చేయడం వెనక ఉన్న కారణాలు ఏమిటో పోలీసులు నిగ్గు తేల్చాలి. ఆ మూకను నడిపిస్తున్నది ఎవరో గుర్తించి కఠినంగా శిక్షించాలి. ఈ దాడిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలి. సనాతన ధర్మ పరిరక్షణ కోసం పలు విలువైన సూచనలను రంగరాజన్ నాకు అందించారు.

టెంపుల్ మూమెంట్ అనే కార్యక్రమం ఏ దశలో ప్రారంభించాల్సి వచ్చిందో తెలిపారు. హిందూ ఆలయాల నిర్వహణ, ధర్మ పరిరక్షణపై ఆయన ఎంతో తపన పడుతున్నారు. ఆయనపై చోటు చేసుకున్న దాడిని ప్రతి ఒక్కరం ఖండించాలి. చిలుకూరు వెళ్ళి రంగరాజన్‌ని పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇవ్వాలని జనసేన పార్టీ తెలంగాణ విభాగానికి దిశానిర్దేశం చేశాను అని పవన్ కల్యాణ్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## వినుకొండకు అగ్నిమాపక కేంద్రం మంజూరు చేయండి

◆ హోం మంత్రికి జీవీ వినతి



**వినుకొండ, మహానాడు:** వినుకొండకు అగ్నిమాపక కేంద్రాన్ని మంజూరు చేసి, త్వరితగతిన ఏర్పాటు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనితకు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. అవసరమైన స్థలం కూడా సిద్ధంగా ఉందని, కావాల్సిన ఏర్పాట్లను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని, హోంశాఖ తరఫున త్వరితగతిన అనుమతులు ఇప్పించాలని కోరారు. జీవీ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన హోంమంత్రి అనిత.. పరిశీలించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. సోమవారం శ్రీశైలం వెళ్తూ మార్గ మధ్యంలో వినుకొండలో ఆగిన హోంమంత్రి అనితకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. జీవీ ఆంజనేయులు ఆహ్వానం మేరకు కొత్తపేటలోని ఆయన నివాసానికి వెళ్లారు. జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. జీవీ ఇంట్లో అల్పాహారం స్వీకరించారు. వంగలపూడి అనితను ఘనంగా సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు.

ఈ సందర్భంగా పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. వినుకొండలో పోలీసులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలపై కూడా చర్చకు వచ్చాయి. అనంతరం శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించేందుకు హోంమంత్రి అనిత బయలుదేరి వెళ్లారు.

## మీరు కొద్దిరోజులు పార్టీకి దూరంగా ఉండండి

◆ అభియోగాల నేపథ్యంలో కిరణ్‌పై జనసేన అధిష్ఠానం చర్య



**మంగళగిరి, మహానాడు:** ఓ మహిళతో వివాహేతర బంధం... ఆమెతో ఆర్థికపరమైన సంబంధాలని అభియోగాలు... వాటికి సంబంధించి సోషల్ మీడియాలో వీడియోలు వెరసి జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ పై ఓ పెద్ద రచ్చ సాగుతున్న సంగతి తెలిసిందే. శనివారం నుంచి ఇదే విషయంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అయితే, రాయల్ కూడా ఈ వ్యవహారంపై ఘాటుగానే స్పందించారు. . తనకు సంబంధించిన వీడియోలు ఎవరు విడుదల చేస్తున్నారో కనుక్కోవాలని వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ వ్యవహారంపై జనసేన విచారణకు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా విచారణ పూర్తయ్యేదాకా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలంటూ రాయల్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పార్టీ తరఫున ఆదివారం ఓ కీలక ప్రకటన జారీ అయ్యింది. ఈ ప్రకటనలో కిరణ్ రాయల్ పార్టీ కార్యక్రమాలకు ఎందుకు దూరంగా ఉండాలన్న విషయాన్ని స్పష్టం చేసింది. విచారణను నిస్పక్షపాతంగా చేపట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. ఈ మాటతో రాయల్ పై విధించిన ఈ నిషేధాజ్ఞలు తాత్కాలికమేనని పార్టీ చెప్పినట్టు అయ్యింది. విచారణ పూర్తి కాగానే రాయల్ యథావిధిగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.

రాయల్‌పై రేగిన ఈ వివాదం నేపథ్యంలో.. పార్టీ శ్రేణులకు అధిష్ఠానం కీలక సూచనలు చేసింది. ప్రజలకు ఉపయోగపడే విషయాలపై మాత్రమే దృష్టి సారించాలని ఇతరత్రా విషయాలను ఏమాత్రం పట్టించుకోరాదని సూచించింది. సమాజానికి ఉపయోగపడని వ్యక్తిగత విషయాలను పక్కన పెట్టేయాలని కూడా సూచించింది. అటు కిరణ్ రాయల్ ను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని.. ఇటు పార్టీ శ్రేణులు మరింత జాగ్రత్తగా ఉంచాలని కూడా స్వయంగా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సూచించినట్టు ఆ ప్రకటనలో పేర్కొనడం విశేషం.

## 'స్టార్స్ ప్రోగ్రామ్'లో ఏపీ చేర్చండి

◆ లోక్‌సభలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు విజ్ఞప్తి





**న్యూఢిల్లీ:** 2025–26 బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి రూ. 15,000 కోట్లు, జీవనాడి పోలవరం ప్రాజెక్ట్‌కు రూ.12,000 కోట్లు, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు రూ.11,440 కోట్లు, వెనుకబడిన జిల్లా రాయలసీమ ప్రాంతం అభివృద్ధికి రూ. 1,750 కోట్లు, వైజాగ్ రైల్వే జోన్ కు శంకుస్థాపన, బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీకి రూ. 65,000 కోట్లు, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కి రూ. 1.8 లక్షల కోట్లువంటి కేటాయింపులపై నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని తిరిగి గాడిలో పెట్టేందుకు దార్శనికతతో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారని, ఈ బడ్జెట్ మరింత ఊతం ఇస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే అభివృద్ధికి రూ. 9,417 కోట్లు వచ్చాయి, ఇది గత బడ్జెట్‌ల కంటే 11 రెట్లు పెరిగింది, రోడ్లు, వంతెనల నిర్మాణానికి రూ. 240 కోట్లు కేటాయించారని తెలిపారు. పిఎం శ్రీ పాఠశాలలు ఆంధ్రప్రదేశ్‌కు 855 మాత్రమే ఎంపిక చేశారని, మరిన్ని పాఠశాలలను ఈ పథకం కింద చేర్చాలని కోరారు.

పాఠశాల విద్యను బలోపేతం చేసే స్టార్స్ ప్రోగ్రామ్ అనే కేంద్ర ప్రాయోజిత పథకంలో ఆంధ్రప్రదేశ్‌ను చేర్చాలని డిమాండ్ చేశారు. ఏపీలోని అనేక కేంద్ర సంస్థలు ఇప్పటికీ తాత్కాలిక క్యాంపస్‌ల నుండి పనిచేస్తున్నాయని, శాశ్వత మౌలిక సదుపాయాలు అవసరం అని, వీటిని త్వరగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రధాన నగరాలు అయిన వైజాగ్, విజయవాడ మెట్రో ప్రాజెక్ట్‌లకు రూ. 11,498 కోట్లు, రూ. 11,009 కోట్లతో ఆమోదించి,, కేంద్రమే 100 శాతం నిధులు భరించేలా ప్రతిపాదనలను కేంద్రం పరిగణించాలని, విభజన చట్టం ప్రకారం న్యాయం చేయాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద.. సామాజిక భద్రత కోసం చేనేత కార్మికులను చేర్చాలని కోరారు. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ నిధులు.. 2024–25లో రూ. 50,000 కోట్ల కాగా అది కాస్తా రూ. 200 కోట్లకు పడిపోయింది, పరిశోధనలు ఆవిష్కరణల కోసం సరైన కేటాయింపులు చేయాలని కోరారు.



## ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించండి

**చల్లపల్లి, మహానాడు:** కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అలపాటి రాజేంద్రప్రసాద్(రాజా)ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కూటమి నేతలు విజ్ఞప్తి చేశారు. శాసన మండలి ఎన్నికల సందర్భంగా సోమవారం చల్లపల్లిలో టీడీపీ, జనసేన నేతలు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యత ఓటు ఆలపాటి రాజాకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, షేక్ నబీఘోరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తోట కనకదుర్గ, బావిశెట్టి కనకదుర్గ, గంగాధరరావు తదితరులున్నారు.

## టీటీడీ నెయ్యి కుంభకోణంపై లోతుగా దర్యాప్తు జరగాలి!

◆ శ్రీవారి భక్తుడు నవీన్ కుమార్ రెడ్డి

**విజయవాడ, మహానాడు:** టీటీడీ కి కల్తీ నెయ్యి సప్లై చేసిన కంపెనీ వారితో పాటు అనుమతించిన టీటీడీ అధికారులపై సీబీఐ విచారణ రగాలని, గత ప్రభుత్వంలో కల్తీ నెయ్యి కొనుగోళ్ల వ్యవహారంలో స్వామికే మోసం చేసిన డిప్యూటేషన్ అధికారుల,ప్రభుత్వ పెద్దల భరతం పట్టాలని శ్రీవారి భక్తుడు నవీన్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ లో కొనుగోళ్ల కమిటీకి సంబంధించి "జి ఎం ప్రొక్యూర్మెంట్" "టిటిడి బోర్డు మెంబర్స్" "ఎఫ్ఏ అండ్ సీఏవో" లు టెండర్ ఫైనలైజ్ చేసిన తర్వాత సప్లై కి అనుమతులు ఇస్తారు. బోలె బాబా వైష్ణవి డైరీ, ఏఆర్ డైరీ లకు నెయ్యి సప్లై కి అనుమతులు ఇచ్చిన అధికారులు ఎవరు? వారిని సీబీఐ విచారణ చేస్తే నమ్మలేని నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు.

## ఆర్టీసీ ఎం.డి.కి శుభాకాంక్షలు తెలిపిన ఏపీ జేఏసీ అమరావతి

**విజయవాడ, మహానాడు:** ఇక్కడి ఆర్టీసీ హౌస్‌లో ఆర్టీసీ వీసి అండ్ ఎం.డి ద్వారకాతిరుమల రావుని సోమవారం ఏపీ జేఏసీ అమరావతి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ద్వారకాతిరుమల రావు పూర్తి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పుష్ప గుచ్ఛంతో వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి పక్షాన చైర్మన్ బొప్పరాజు, సెక్రటరీ



జనరల్ పలిశెట్టి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిసెట్టి రాజేష్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.శంకర్ రావు, కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్ష/ప్రధాన కార్యదర్శులు శేషగిరి రావు, శ్రీనివాసరావు, ఆర్టీసీ సెక్యూరిటీ ఉద్యోగుల సంఘం పక్షాన మల్లికార్జున, మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీ.నాగేశ్వర రావు, గ్రామ వార్డ్ సచివాలయం ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్యా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్, సహా అధ్యక్షుడు సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## బాలిక విద్యాలయం చుట్టూ భద్రత పెంచండి

◆ కావలి డిఎస్పీకి హోం మంత్రి ఆదేశం

**అమరావతి, మహానాడు:** నెల్లూరు జిల్లా, కావలి పట్టణంలోని ముసునూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఘటనపై హోంమంత్రి తీవ్రంగా స్పందించారు. కావలి డిఎస్పీ శ్రీధర్ తో ఫోన్ లో మాట్లాడారు. అర్ధరాత్రి ఓ దుండగుడు గోడదూకి విద్యార్థినుల గదుల్లోకి ప్రవేశించిన ఘటనలో నిందితుడిని వెంటనే పట్టుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక పికెట్ నిర్వహించి




భద్రత పెంచామని హోంమంత్రికి డీఎస్పీ వివరించారు. వసతి గృహం చుట్టూ భద్రతను పెంచి నిఘా పెట్టాలని ఆదేశించారు. బాలికల తల్లి దండ్రులు ఆందోళన చెందవద్దని హోంమంత్రి అనిత భరోసా కల్పించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 11, ఫిబ్రవరి 2025 ||



# దివ్యాంగులకు రైల్వేశాఖ తీపికబురు

◆ ఆన్‌లైన్‌లోనే పాసుల జారీ

న్యూఢిల్లీ: దివ్యాంగులకు భారత రైల్వే తీపి కబురు అందించింది. ఇకపై రైల్వేపాసుల కోసం రైల్వే కార్యాలయాలు, స్టేషన్లు చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లోనే పొందే ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు రైల్వేశాఖ వెబ్‌సైట్ ప్రారంభించింది. దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి ప్రభుత్వం రాయితీపై ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. రైళ్లు, బస్సుల్లో వారికి ప్రత్యేక




సీట్లు కేటాయింపుతోపాటు... ఛార్జీల్లోనూ రాయితీ ఇస్తోంది. ఆన్‌లైన్‌లోనే పాసు పొందడానికి రైల్వేశాఖ ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించింది. అందులోనే ఈ- టికెట్లు బుక్ చేసుకునే విధానాన్ని కూడా తీసుకొచ్చారు. దివ్యాంగులు ఇకపై ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా పాసులు పొందవచ్చు. http:///divyangjanid.indianrail.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి పాసు కోసం దరఖాస్తు చేయాలి.

## మైనారిటీ వర్గాలవారి రాయితీ రుణాల ఉత్తర్వులు జారీ అభినందనీయం

- ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి చేబ్రోలు

విజయవాడ, మహానాడు: మైనారిటీ వర్గాలవారి రాయితీ రుణాల ఉత్తర్వులు కూటమి ప్రభుత్వం జారీ చేయడం అభినందనీయమని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి చేబ్రోలు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటనల విడుదల చేశారు. ప్రభుత్వం చొరవ వల్ల 49,218 మంది మైనారిటీ వారికి లబ్ధి చేకూరనుంది. జగన్మోహన్ రెడ్డి ఐదు ఏళ్ల పాలనలో ఒక్కరి కంటే ఒక్కరికి కూడా స్వయం ఉపాధి కల్పించలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలలోనే స్వయం ఉపాధికి 326 కోట్లు బడ్జెట్ కేటాయించడం విశేషమన్నారు. దరఖాస్తు సమర్పించేందుకు అప్లికేషన్స్ పెట్టుకోవడానికి ఒకటి రెండు రోజుల్లో జీవో విడుదలవుతుందని తెలిపారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అమరావతి మండల ముఖ్య నాయకులతో సోమవారం సమావేశమైన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్.

# ఊరికిచ్చిన మాటకోసం... హస్తినకు కాలవ

డి.హీరేహాల్ ఊరికిచ్చిన మాట నిలుపుకోడానికి ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసన సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఢిల్లీ పెద్దల తలుపు తట్టారు. తనకున్న పరిచయాలతో గ్రామ సమస్యకు ఓ చక్కటి పరిష్కార మార్గం చూపడానికి ప్రయత్నిస్తున్నారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టిడిపి మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగల్లి రాజులతో కలిసి సోమవారం ఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన వెంటనే స్పందిస్తూ... బెంగళూరు రీజినల్ ఆఫీస్ అధికారితో ఫోన్‌లో మాట్లాడారని ఎమ్మెల్యే కాలవ వివరించారు. ప్రజల అవసరాల దృష్ట్యా సంబంధిత ఫ్లై ఓవర్ నిర్మాణం డిజైనింగ్ లో అవసరమైన మార్పులు చేస్తూ సవరణ నివేదిక పంపాలని ఆదేశించినట్టు తెలిపారు. ప్రజా సమస్యను ఆయన ఎంతో ఆసక్తిగా వినడమేతో పాటు వెను వెంటనే చర్యలకు ఆదేశించడం పట్ల చైర్మన్‌కు కాలవ కృతజ్ఞతలు తెలియచేశారు.

**ఇది నేపథ్యం....**

డి.హీరేహాల్ మండల కేంద్రం మీదుగా వెళ్లే జాతీయ రహదారి అంశంపై గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తపరుస్తున్నారు. బళ్ళారి- బెంగళూరు ప్రధాన నగరాలను కలిపే ఈ మార్గ మధ్యలో బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడుతున్నారు. సిమెంట్ పిల్లర్స్ పై ఫ్లై ఓవర్ లా కాకుండా మట్టితో నిర్మించడం వల్ల గ్రామం రెండు భాగాలుగా విడిపోతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఒకే గ్రామంలో స్థానికులను వేరుచేసినట్లు అవుతుందని, గ్రామానికి కూడా మంచిది కాదంటూ విచారం వ్యక్తపరుస్తూ వస్తున్నారు. ఈ వివాదంపై గతంలో పలుమార్లు ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. స్థానిక అధికారులు సర్దిచెపుతూ అప్పటికప్పుడు ఆందోళన



విరమింప చేస్తూ వచ్చారు. అయితే శాశ్వత పరిష్కారం మాత్రం లభించలేదు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి బలపరుస్తున్న టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యను ఆ నియోజకవర్గ శాసన సభ్యుడు కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానికులు మక్కుమ్మడిగా మట్టి బ్రిడ్జి నిర్మాణాన్ని వ్యతిరేకించారు. సిమెంట్ పిల్లర్ల తో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యకు తమ స్థాయిలో నిర్ణయం తీసుకోలేమని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు తెలియచేశారు. ఢిల్లీలో అత్యున్నతస్థాయి అధికారులు సవరణ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. ఈ సమస్యను ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళతామని సభకు ఆనాడు కాలవ హామీ ఇచ్చారు. కేంద్రంలో ఎన్డీయే కూటమి బలపరుస్తున్న పార్టీనే అధికారంలో ఉన్నందున గ్రామస్థుల కల నెరవేరవచ్చని ఆశాభావం వ్యక్తపరిచారు. గ్రామస్థుల కోరిక మేరకు ఎమ్మెల్యే నేడు ఢిల్లీ వెళ్లడంతో పాటు సానుకూల నిర్ణయంతో త్వరలో తమ ఆశయం ఫలించవచ్చని స్థానికులు విశ్వాసం వ్యక్తపరుస్తున్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# టీడీపీదే హవా!

◆ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ఏలూరు, మహానాడు: దేశవ్యాప్తంగా ఎన్డీఏ గాలి వీస్తోందని, దానిలో భాగం గానే ఏపీలో జరుగుతున్న అన్ని రకాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందుతారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్లో ఉభయగోదావరి జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్ కార్యక్రమంలో మంత్రులు నిమ్మలరామానాయుడు, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ



తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి అధికార పార్టీని మట్టి కల్పించిందని ఇదే తరహా ఫలితాలు రానున్న రోజుల్లో అన్ని చోట్ల వస్తాయని జోస్యం చెప్పారు.

రానున్న రోజులలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం లో ఆంధ్రప్రదేశ్ సస్యశ్యామలం అవుతుంది అని, నిరుద్యోగులు సమస్యలు రూపుమాపే దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలన్నా అది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిత్వాన్ని బలపరిచి గెలిపించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల కోరారు. గోదావరి జిల్లాలోని పట్టభద్రులు అందరూ పేరాబత్తుల రాజశేఖర్ ను అఖండ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మార్గదర్శిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ◆ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మెడికల్ సీట్లు వద్దనడం దారుణం
- ◆ కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చర్యలు హేయం
- ◆ ఇది రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగానికి తీరని నష్టం
- ◆ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై లోక్‌సభలో మాట్లాడిన వైయస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత పీ.వీ.మిథున్‌రెడ్డి.

న్యూఢిల్లీ: ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కొత్త మెడికల్ సీట్లపై ప్రకటన చేసింది. వచ్చే 5 ఏళ్లలో దేశంలో కొత్తగా 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తెస్తామని, ఈ ఏడాది 10 వేల సీట్లు వచ్చేలా చూస్తామని చెప్పింది. కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం తమకు కొత్త మెడికల్ సీట్లు వద్దంటూ లేఖ రాసింది. ఇది చాలా దారుణం.

ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన వైద్య సదుపాయాలు లేవు. కరోనా సమయంలో వైద్యం కోసం రాష్ట్ర ప్రజలు ఎక్కడెక్కడికో వెళ్లాల్సి వచ్చింది. ఆ పరిస్థితిని మార్చడానికి ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో ఒకేసారి కొత్తగా 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం మొదలుపెట్టి, వాటిలో 5 కాలేజీలను గత ఏడాదే ప్రారంభించడం జరిగింది.

కానీ, ప్రభుత్వం మారడంతో, ఆ మెడికల్ కాలేజీలకు గ్రహణం పట్టింది. కాలేజీల పనులు ఆపేయడమే కాకుండా.. పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేసే పని మొదలు పెట్టారు. కేవలం గత ప్రభుత్వం వాటిని చేపట్టింది కాబట్టి, వాటిని పూర్తి చేయకపోవడం, ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించడం అత్యంత దారుణం.

రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తున్నారు. ఇది ఆంధ్రప్రదేశ్‌కు తీరని నష్టం చేస్తుంది. ఆ నిర్ణయం ఎవరిది? ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తుతోనే నిర్మిస్తామని చెబుతున్నారు. దీని వల్ల ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గిపోతుంది. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే కడుతుందని, విభజన చట్టంలో చెప్పారు. ఆ ప్రాజెక్టుకు రూ.30 వేల కోట్ల వ్యయం అవుతుంది. కానీ మొత్తంగా రూ.30 వేల కోట్లు మాత్రమే ఇస్తామంటున్నారు. మరి మిగిలిన నిధుల సంగతి ఏమిటి?.ఆ నిధుల్లో కూడా ప్రాజెక్టు కోసం ఈ ఏడాది రూ.5 వేల కోట్లు, వచ్చే ఏడాది మరో రూ.5 వేల కోట్లు ఇస్తామంటున్నారు. దీని వల్ల పనులెలా సాగుతాయి?

లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సందర్భందా కేంద్ర ఆర్థిక మంత్రి సహారా సంస్థ గురించి మాట్లాడారు. ఆ సంస్థ ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించి, దాన్ని ఇతర మార్గాల్లోకి మళ్లించిందని ఆమె వెల్లడించారు. సహారా సంస్థ ఎంతో మంది డిపాజిటర్లను మోసం చేసిందని, అందుకే సహారాపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇది మంచిదే. మరి మార్గదర్శి సంస్థను ఎందుకు విడిచిపెట్టారు. దాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు. మార్గదర్శి కూడా చట్ట విరుద్ధంగా ఏకంగా రూ.2,600 కోట్ల డిపాజిట్లు సేకరించింది. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా వేల కోట్ల డిపాజిట్లు సేకరించిన మార్గదర్శి, ఆ న్యిధులను ఇతర మార్గాల్లోకి మళ్లించింది.



ఆ మేరకు ఆర్బీఐ కోర్టులో అఫిడవిట్ కూడా దాఖలు చేసింది. మార్గదర్శి వసూలు చేసిన డిపాజిట్లపై ఆదాయపు పన్ను శాఖ కూడా కేసు నమోదు చేసి, రూ.1000 కోట్ల ఫైన్ వేస్తే, దానిపై వారు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ఇది చాలా పెద్ద నేరం. చట్టం అందరికీ సమానమే. మార్గదర్శి సంస్థకు మీడియా ఉంది కాబట్టి, వారిని ఉపేక్షించడం ఏ మాత్రం సరికాదు.

నేను ఈ అంశాన్ని సభలో ప్రస్తావిస్తున్నందుకు, నాపై రోజు ఆ మీడియాలో కథనాలు రాస్తున్నారు. అయినా నేను భయపడబోను. వెనక్కు తగ్గబోను. మార్గదర్శి వల్ల చాలా మంది డిపాజిటర్లు నష్టపోయారు. వారికి న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగబోదు. ఈ విషయంలో గతంలో ప్రభుత్వం ఇచ్చిన మాట ఏమైంది? ఈడీ దర్యాప్తు ఏమైంది? అంత పెద్ద నేరం గురించి ఎందుకు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు?.

సభలో ఉన్న ప్రతి ఒక్కరిని నేను కోరుతున్నాను. 'గూగుల్ సెర్చ్‌లోకి వెళ్లి మార్గదర్శి అని కొట్టండి. మొత్తం చరిత్ర వస్తుంది. ఆ సంస్థ యజమాని ఒక బంగారు కుర్చీలో కూర్చుని ఉంటే, మంత్రులు ఆయన ముందు మోకరిల్లి ఉంటారు.ఆ విధంగా ఒక స్కామ్ చేసిన సంస్థను కాపాడుతున్నారు. ఆ సంస్థ ప్రజాధనాన్ని మళ్లించింది. నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించింది. కాబట్టి, తప్పనిసరిగా గట్టి చర్య తీసుకోవాలి. కాబట్టి ప్రభుత్వం వెంటనే కఠిన చర్య తీసుకోవాలి.

ఇక క్యాపిటల్ అమరావతికి సంబంధించి రూ.15 వేల కోట్లు రుణ రూపంలో ఇస్తున్నారు. కానీ, గ్రాంట్ లేదు. ఇది ఎంత వరకు న్యాయం?. రాష్ట్ర విభజన చట్టంలో హామీ ఇచ్చినా కూడా, 10 ఏళ్ల తర్వాత విశాఖకు రైల్వే జోన్ ఇచ్చారు. కానీ, ఇక్కడా అన్యాయం చేశారు. వాల్తేరు డివిజన్‌ను రెండుగా విభజించి ఇచ్చారు. ఇది అన్యాయం. కాబట్టి వాల్తేరు డివిజన్ మొత్తాన్ని జోన్‌లో చేర్చాలి. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రభుత్వ వైఖరి ఏమిటి? నేను మంత్రిని సూటిగా అడుగుతున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కొనసాగిస్తారా? లేక ప్రైవేటుపరం చేయబోతున్నారా? సమాధానం చెప్పండి.మేము విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము. కాబట్టి మంత్రిగారు దీనిపై ప్రకటన చేయాలి.

మా రాష్ట్ర సీఎం గొప్పగా చెబుతారు. తమ 16 మంది ఎంపీల మద్దతుతో ప్రభుత్వం సాగుతోందని, ప్రభుత్వంలో తమది కీలకపాత్ర అంటారు. మరి 12 మంది ఎంపీలు ఉన్న బీహార్ కేంద్రం నుంచి ఎన్నో పొందుతోంది. అంత కంటే ఎక్కువ మంది ఎంపీలు ఉన్న, మా రాష్ట్రానికి మాత్రం అన్యాయం చేస్తున్నారు. పోలవరంకు నిధులు ఇవ్వడం లేదు. రైల్వే జోన్‌లోనూ అన్యాయం చేశారు. కాబట్టి వీటన్నింటిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి.



పుణెలో జరిగిన లీడర్ షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

- ◆ 300 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్న కార్యక్రమంలో ఉత్తమ విధానాలు, సుపరిపాలనపై మేధోమథనం
- ◆ రాష్ట్ర ప్రభుత్వ నూతన పాలసీలు, 2047 విజన్ లక్ష్యాలను కాంక్లేవ్‌లో వివరించిన ఏపీ నుంచి హాజరైన కుమార్ రాజా



అమరావతి: పుణెలో ఈ నెల 8, 9వ తేదీల్లో జరిగిన లీడర్ షిప్ కాంక్లేవ్‌లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ కాంక్లేవ్‌కు దేశం మొత్తం మీద 300 మంది ఎమ్మెల్యేలు హాజరుకాగా ఏపీ నుంచి కుమార్ రాజా హాజరయ్యారు. సుపరిపాలన, పబ్లిక్ పాలసీల రూపకల్పనపై ఆలోచనలు, ఉత్తమ అభ్యాసాలపై చర్చించేందుకు కాంక్లేవ్ నిర్వహించారు. ఈ కాంక్లేవ్‌లో స్వర్ణాంధ్ర విజన్, పేదరిక నిర్మూలనకు రూపొందించిన పీ4 విధానాలపై ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఈ మేరకు కాంక్లేవ్ వివరాలను ఎమ్మెల్యే కుమార్ రాజా సోమవారం సీఎంకు చంద్రబాబుకు వివరించారు. కుమార్ రాజాను సీఎం అభినందించారు.







# అమెరికాలో చేనేత ఎక్స్ పో



◆ మంత్రి సవితతో చికాగో ప్రతినిధులు

అమరావతి, మహానాడు: రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవితను అమెరికాలోని చికాగో రాష్ట్ర ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ లో చికాగో లో పురుడ్యూ యూనివర్శిటీ, జీఎస్ఏ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబోయే జీఎస్ఏ గ్లోబల్ మిల్లిట్స్ ఎక్స్ పో లో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రి సవితకు చికాగో ప్రభుత్వ ప్రతినిధి లా షాన్ కె.ఫోర్డ్ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవితతో చికాగో రాష్ట్ర ప్రతినిధులు చర్చించారు. అమెరికాలో చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంపై తమవంతు సాయమందిస్తామన్నారు. ఇందుకోసం పలు రాష్ట్రాల్లో చేనేత ఎక్స్ పో లు నిర్వహిస్తామన్నారు. పురుడ్యూ యూనివర్శిటీ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల డిజైన్ల తయారీపై ఆంధ్రప్రదేశ్ చేనేతలకు శిక్షణ కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత స్పందిస్తూ, అమెరికాలో చేనేత ఎక్స్ పోల నిర్వహణపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళతామన్నారు.

నేతన్నలకు నూతన డిజైనింగ్ శిక్షణివ్వడానికి ముందుకొచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్ ప్రభాకర్, డాకర్టర్ రాజీవ్, డాక్టర్ మహ్మద్ తాజ్ ముల్ హుస్సేన్, విశ్వభారతి, కె.కృష్ణమూర్తి, తిరునగరి జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ మంగళవారం 11, ఫిబ్రవరి 2025 ‖





## 'జాబిలమ్మ నీకు అంతా కోపమా' ట్రైలర్

పా పాండి, రాయన్ వంటి బ్లాక్ బస్టర్‌ల తరువాత ధనుష్ 'జాబిలమ్మ నీకు అంతా కోపమా' అంటూ దర్శకుడిగా మరోసారి అందరినీ మెప్పించేందుకు రెడీ అయ్యారు. ధనుష్ హోమ్ బ్యానర్ అయిన వండర్‌బార్ ఫిల్మ్స్, ఆర్‌కె ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 21న విడుదల చేయనున్నారు. తెలుగులో ఈ మూవీని ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి విడుదల చేస్తోంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రమోషన్స్‌ను పెంచేశారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన పాటలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇక తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్ ప్రారంభంలో.. ధనుష్ కనిపించి ఇదొక సాధారణ ప్రేమ కథ అని అసలు కథలోకి తీసుకెళ్తాడు. ఓ ప్రేమ, బ్రేకప్ నేపథ్యంలో ఈ సినిమా ఆద్యంతం వినోదభరితంగా ఉండబోతోందని అర్థం అవుతోంది. మాజీ ప్రేయసి పెళ్లి వెళ్లాల్సిన పరిస్థితి రావడం, అక్కడ ఎదురయ్యే సంఘటనలు, ఇలా అన్నీ కూడా యూత్ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్నాయి. ప్రజెంట్ ట్రెండ్‌కు తగ్గ స్టోరీతో ధనుష్ రాబోతోన్నాడని ఈ ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. జివి ప్రకాష్ కుమార్ అద్భుతమైన పాటలు, ఆర్ఆర్ ఈ సినిమాకు ప్లస్ అవుతాయని ట్రైలర్ చెప్పకనే చెబుతోంది.

పవిష్, అనిఖా సురేంద్రన్, ప్రియా ప్రకాష్ వారియర్, మాథ్యూ థామస్, వెంకటేష్ మీనన్, రబియా ఖాటూన్, రమ్య రంగనాథన్ ఇలా అన్ని పాత్రలకు ఇంపార్టెన్స్ ఉందని ట్రైలర్ చూస్తేనే అర్థం అవుతోంది. ప్రియాంక అరుల్ మోహన్ స్పెషల్ అప్పియరెన్స్, ఆ పాటకు సంబంధించిన బిట్ కూడా ట్రైలర్‌లో పొందు పర్చారు.



# విశ్వక్‌సేన్ ఇండస్ట్రీలో జెండా పాతాలి

## - మెగాస్టార్ చిరంజీవి

మాస్ కా దాస్ విశ్వక్సేన్ యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్‌తో స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రానికి రామ్ నారాయణ్ దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్ గా నటిస్తోంది. పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. లేటెస్ట్ గా విడుదలైన ట్రైలర్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. లైలా ఫిబ్రవరి 14న బిగ్ స్క్రీన్స్ లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ మెగా మాస్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది. మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇలాంటి ఈవెంట్స్ కి రావడం వల్ల ఇక్కడున్న ఎనర్జీ నాకు ఎంతో ఉత్సాహం ఇస్తుంది. ఇంత ఎనర్జీ ఇచ్చిన అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. విశ్వక్ సేన్ ఫంక్షన్ కి వెళుతున్నావా? అని అడిగారు. ఏం ఎందుకు వెళ్ళకూడదు? అతను మన మనిషి కాదు.. బాలకృష్ణ.. అప్పుడప్పుడు తారక్ అంటాడు. అంటే మనుషులంటే వేరే వాళ్ళ మీద అభిమానం ప్రేమ ఉండకూడదా? మా ఇంట్లోనే మా అబ్బాయికి సూర్య అంటే చాలా ఇష్టం. అంత మాత్రాన వాడి ఫంక్షన్ కి నేను వెళ్ళకూడదా? విశ్వక్ కి ఈ ప్రశ్న అడగడం నేను చూశాను. దానికి విశ్వక్ చాలా చక్కని సమాధానం చెప్పాడు. మా ఇంటికి కాంపౌండ్ ఉంటుంది కానీ సినిమా ఇండస్ట్రీకి కాంపౌండ్ లేదు అన్నాడు. నిజంగా తనని అభినందిస్తున్నాను. అభిమానులు వాల్ పోస్టర్లు చింపుకోవడం నేను చూశాను. నెల్లూరు లో మా కజిన్స్ ఒకరు రామరావుని, ఒకరు ఏఎన్ఆర్ అభిమానించి ఒకరిని ఒకరు కొట్టుకునేవారు. హీరోలు బాగానే వుంటారు. అభిమానులు కొట్టుకుంటున్నారనే ఆలోచన ఆ రోజు నుంచే నాకు మొదలైయింది. నేను ఫిల్మ్ యాక్టర్ అయిన తర్వాత హీరోల మధ్య సక్యత సహృద్భావ వాతావరణం ఏర్పాటు చేయాలని బలంగా కోరుకున్నాను. మద్రాస్ లో హనీ హౌస్ లో అందరం కలిసి పార్టీలు చేసుకునే వాళ్ళం. బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున మేమంతా కలసికట్టుగా వుంటాం. బాలయ్య 50 ఇయర్స్ వేడుకకు నేను వెళ్లాను. మా మధ్య ఎలాంటి అరమరికలు లేవు. అందరం కలివిడిగా వుండాలి. పుష్ప 2 పెద్ద హిట్ అయ్యింది. దానికి నేను గర్విస్తాను. ఇండస్ట్రీలో ఒక సినిమా ఆడింది అంటే అందరం ఆనందం పడాలి. ఆ ఆనందం ఇవ్వడానికి ఈ వేడుకకు వచ్చాను. ఇండస్ట్రీ ఒకటే కాంపౌండ్. ఈ సినిమా ట్రైలర్ చూసిన తర్వాత ఎక్కడో అనగారిపోయిన కోరిక గబుక్కున పెళ్ళుబికింది. లైలా గెటప్ లో విశ్వక్ కసక్ లా అనిపిస్తున్నాడు(నవ్వుతూ). అంతగ్లామర్ గా వున్నాడు. నేను, నరేష్, రాజేంద్ర ప్రసాద్ లేడి గెటప్స్ వేశాం. ఆ సినిమాలన్నీ హిట్ అయ్యాయి. లైలా కూడా హిట్ గ్యారెంటీ. తప్పకుండ ఈ సినిమాకి ఆడియన్స్ వెళ్తారు. ఎంజాయ్ చేస్తారు. విశ్వక్ మాస్ క్లాస్ ఇటు అమ్మాయిగా అద్భుతంగా చేశాడు. దర్శకుడు రామ్ చాలా ఎంటర్‌టైన్మెంట్ తో తీశాడు.

ఈ సినిమా బ్లాక్‌బస్టర్. విశ్వక్ చాలా ప్రతిభావంతుడు. తన ఇండస్ట్రీలో జెండా పాతాలి. ఇప్పటికే ప్రూవ్ చేసు కున్నాడు. ఈ సిని మాతో మగవాళ్ళ గుండెల్లో స్థానం సంపాదించు కుంటాడు. అభిమన్యు సింగ్, పృద్వీ, ఆకాంక్ష, కామక్షి అందరూ చక్కగా పెర్ఫార్ చేశారు. టీం అందరికీ ఆల్ ది బెస్ట్. సాహు నిర్మాతగా ఇప్పుడే బ్లాక్ బస్టర్ ఇచ్చిన అనిల్ రావిపూడి దర్శకత్వంలో నేను ఒక సినిమా చేయబోతున్నాను. సినిమా సమ్మర్ లో ప్రారంభం కాబోతోంది అన్నారు.

# 'ఇట్స్ కాంప్లికేటెడ్' నా కెరీర్‌లో చాలా స్పెషల్ - సిద్ధు జొన్నలగడ్డ


స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ రొమాంటిక్ కామెడీ మూవీ కృష్ణ అండ్ హిస్ లీల. 2020లో కరోనా మహమ్మారి సమయంలో ఓటీటీలో నేరుగా విడుదలైన ఈ సినిమా ఇన్స్టంట్ హిట్ సాధించింది. రవికాంత్ పెరెపు దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సంజయ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం లవ్ స్టోరీ పై ఒక రిఫ్రెషింగ్ టేక్. ఇందులో శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్, షాలిని వడ్నికట్టి కీలక పాత్రల్లో నటించారు. రానా దగ్గుబాటి ఈ పాపులర్ చిత్రాన్ని ప్రేమికుల రోజున థియేటర్లలో విడుదల చేయనున్నారు. డిజిటల్ లో మాత్రమే విడుదలైన ఈ చిత్రం ఫిబ్రవరి 14న కొత్త ట్విస్ట్‌తో థియేటర్లలోకి వస్తుంది. ఈ సినిమా టైటిల్‌ను 'ఇట్స్ కాంప్లికేటెడ్'గా మార్చారు. ఈ కొత్త టైటిల్ మరింత ఆసక్తిని జోడించడమే కాకుండా, సినిమా కంటెంట్ కి పర్ఫెక్ట్ గా యాప్ట్ అయ్యింది. ఇప్పటికే విడుదలైన అనౌన్స్ మెంట్ వీడియో వైరల్ అయ్యింది. తాజాగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. బాయ్ సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ..'ఇట్స్ కాంప్లికేటెడ్' సినిమా నాకు చాలా స్పెషల్. పాండమిక్ కారణంగా థియేటర్స్ లో రిలీజ్ కాలేదు. ఈ సినిమాని థియేటర్స్ లో చూస్తే ఎలాంటి రెస్పాన్స్ వచ్చేదో అనే ఆసక్తి వుండేది. ఈ మూవీ జర్నీలో నటుడిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నా. రవితో కొలాబరేషన్ ఎప్పుడూ కొత్తగా వుంటుంది. థియేటర్లలో విడుదల చేయలేకపోయమన్న బాధ నాకు, రవికాంత్‌కు ఎప్పుడూ ఉండేది. ఈ మూవీ రీ రిలీజ్ కోరుతూ అభిమానులు కొందరు రవికాంత్‌కు సోషల్ మీడియాలో మెసేజ్ చేసేవారు. వాటిని చూశాక.. నాకూ ఈ సినిమాని థియేటర్స్‌కి తీసుకొస్తే బాగుంటుందనిపించింది. రానాకు చెబితే తక్కువ సమయంలోనే రిలీజ్ ప్లాన్ చేశారు. థియేటర్స్ లో ఆడియన్స్ రియాక్షన్ ఎలా వుంటుందో చుడాలనే ఎక్సయిట్మెంట్ వుంది. అప్పటి కంటే ఇప్పుడు ఈ సినిమా ఇంకా రిలవెంట్ అనిపిస్తోంది' అన్నారు.




## సందీప్‌కిషన్, రీతూవర్మ
# లవ్ ట్రాక్

పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ మోస్ట్ ఎవైటెడ్ 30వ మూవీ 'మజాకా' హ్యూజ్ బజ్ ని క్రియేట్ చేస్తోంది. త్రినాధ రావు నక్కిన దర్శకత్వం వహించిన ఈ మూవీ టీజర్ హిలేరియర్స్ ఎంటర్టైమెంట్ ని అందించింది. ఈ చిత్రం ఎకె ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ ల కొలాబరేషన్ లో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. సహ నిర్మాత బాలాజీ గుత్తా. రీతు వర్మ హీరోయిన్ గా నటిస్తున్న మజాకాలో రావు రమేష్ అన్న కూడా కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. మొదటి సింగిల్ బ్యాచులర్స్ ఆంథమ్ సూపర్ హిట్ అయింది. ఇప్పుడు విడుదలైన సెకండ్ సింగిల్ బేబీ మా చార్ట్ బస్టర్ లవ్ సాంగ్. ఈ పాటలో సందీప్ కిషన్ ప్రేమలో పడిన కథను బ్యూటీఫుల్ గా చూపించారు. ఈ పాట సందీప్ తండ్రి రావు రమేష్, అన్న ప్రేమకథను కూడా ప్రెజెంట్ చేస్తోంది. ట్రాక్ సెకండ్ పార్ట్ లో ఆమె తనను వివాహం చేసుకోవాలని ఎంచుకుంటే జీవితం ఎంత అద్భుతంగా ఉంటుందో హీరో నమ్మకంగా చెబుతాడు. వారి జీవితాలు ప్రతిరోజూ వాలెంటైన్స్ డే లాగా ఉండాలని కోరుకుంటాడు. సందీప్ కిషన్ ఎనర్జిటిక్‌గా కనిపించారు. ఎలిగెంట్ డ్యాన్స్ మూమెంట్స్ తో ఆకట్టుకున్నారు.





## 'డాక్టర్ భ్రమరం' క్యారెక్టర్‌లో వెన్నెల కిషోర్

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు". ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. అల్లు శిరీష్ హీరోగా "ఏబీసీడీ" సినిమా, రాజ్ తరుణ్ తో "అహ నా పెళ్లంట" అనే వెబ్ సిరీస్ రూపొందించిన దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వెంకటాద్రి ఎక్స్ ప్రెస్, ఎక్స్ ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి చిత్రాలకు స్క్రీన్ ప్లే అందించిన రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే రాస్తున్నారు. మ్యూజికల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా తెరకెక్కుతోంది. "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా నుంచి వెన్నెల కిషోర్ నటించిన డాక్టర్ భ్రమరం క్యారెక్టర్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. డాక్టర్ భ్రమరం పాత్రలో వెన్నెల కిషోర్ నవ్వులు పూయించనున్నారు. గర్భగుడి వెల్ నెస్ సెంటర్ నిర్వహించే డాక్టర్ భ్రమరం తన దగ్గరకు సంతాన లేమి సమస్యలతో వచ్చే వారిని ఆయుర్వేద వైద్యాన్ని మోడరన్ మందులతో కలిపి ఎలా ట్రీట్ చేశారు అనేది హిలేరియస్ గా ఉండబోతోంది. డాక్టర్ భ్రమరం పాత్రలో వెన్నెల కిషోర్ చెప్పే డైలాగ్స్, కామెడీ టైమింగ్ ప్రేక్షకుల్ని థియేటర్స్‌లో నవ్వుల్లో ముంచెత్తనుంది.

# ఫిబ్రవరి 28న 'గార్డ్' అందరూ సపోర్ట్ చేయాలి

విరాజ్ రెడ్డి చీలం హీరోగా జగ పెద్ది దర్శకత్వంలో అను ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అనసూయ రెడ్డి నిర్మించిన చిత్రం 'గార్డ్'. రివేంజ్ ఫర్ లవ్ అనేది ఉప శీర్షిక. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 28న రిలీజ్ చేయబోతోన్నారు. సినిమా మొత్తాన్ని ఆస్ట్రేలియాలో షూట్ చేయడం విశేషం. హారర్, థ్రిలర్, లవ్ ఎలిమెంట్స్‌తో రాబోతోన్న ఈ చిత్రంలో మిమీ లియానార్డ్, శిల్పా బాలకృష్ణ కథానాయికలుగా నటించారు. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రయూనిట్ మీడియా ముందుకు వచ్చింది. ఈ మేరకు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో.. విరాజ్ రెడ్డి చీలం మాట్లాడుతూ.. 'గార్డ్ మూవీ కోసం ఇలా మొదటి సారిగా మీడియా ముందుకు వచ్చాను. గార్డ్ కోసం చాలా కష్టపడ్డాం. మీడియా సపోర్ట్ ఉంటేనే ఇండస్ట్రీలో ఏదైనా సాధించగలం. మా టీంను మీడియా సపోర్ట్ చేస్తుందని భావిస్తున్నాను. మా టీజర్ నచ్చితే మాకు సపోర్ట్ చేయండి. మా డైరెక్టర్, టీం ఆస్ట్రేలియాలో ఉంది. రాజేష్ ఎడిటింగ్ చాలా బాగుంటుంది. అవుట్ పుట్ బాగా ఇచ్చాడు. సౌండ్ డిజైనింగ్, మిక్సింగ్ చేసిన బీనా లేడీ బాస్ టైపులో ఉంటారు. పార్థు పోస్టర్లను చక్కడా డిజైన్ చేశారు. సందీప్ ఈ ప్రాజెక్ట్ కోసం చాలా కష్టపడ్డారు. ప్రణయ్ మా సినిమాకు మంచి మ్యూజిక్ ఇచ్చారు. మంచి లవ్ సాంగ్స్ ఇచ్చారు. సిద్దార్థ్ బీజీఎం గురించి అందరూ మాట్లాడుకుంటారు. జగ పెద్ది మా సినిమాకు దర్శకుడు. ఆయన్నుంచి నేను చాలా నేర్చుకున్నాను. ఈ సినిమాలో ఏ ఒక్కరూ కొత్త యాక్టర్ అన్న ఫీలింగ్ రాదు. మిమి లియోనార్డ్, శిల్పా ఇలా అందరూ అద్భుతంగా నటించారు.





## తకిట తదిమి తందాన
# ఫస్ట్‌లుక్

తక్కువ బడ్జెట్ చిత్రమా? కొత్త నటీనటులా అనే విషయాన్ని పట్టించుకోకుండా మంచి కంటెంట్‌తో ఫీల్‌గుడ్‌గా నిలిచే చిత్రాలు మంచి విజయాలను అందుకొంటున్నాయని తెలంగాణా రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. కంటెంట్ ప్రధానంగా వచ్చే చిత్రాలే ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచుతున్నాయని ఆయన్ తెలిపారు. "తకిట తదిమి తందాన" చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ ను ఆవిష్కారం అనంతరం ఆయన చిత్రబృందాన్ని అభినందిస్తూ పైవిధంగా పేర్కొన్నారు. "మర్డర్" మూవీలో హీరోగా నటించిన ఘన ఆదిత్య, నూతన తెలుగు అమ్మాయి ప్రియ జంటగా యువ దర్శకుడు రాజ్ లోహిత్ దర్శకత్వంలో ఎల్లో మాంగో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానరుపై చందన్ కుమార్ కొప్పుల నిర్మించిన "తకిట తదిమి తందాన" చిత్ర ఫస్ట్ లుక్ ను మంత్రి శ్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత రామసత్యనారాయణ, సినీటేరియా మీడియా వర్క్స్ అధినేత వెంకట్ బులెమోని, చిత్ర దర్శకుడు రాజ్ లోహిత్, నిర్మాత చందన్ కుమార్ కొప్పులతోబాటు, నటీనటులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు. ఈ నెల 27వ తేదీన తకిట తదిమి తందాన" చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేస్తున్నామని చిత్ర నిర్మాత చందన్ కుమార్ పేర్కొన్నారు. ఈ చిత్రం సినెటేరియా మీడియా వర్క్స్ ఆద్వర్యంలో విడుదల కానుంది.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144